RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక 18వ వసంతంలోకి

EDITOR :BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME:18 ISSUE:27 WEDNESDAY ,JUNE 24,2026 PAGES:20 COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :27 బుధవారం, జూన్ 24, 2026, పేజీలు -20 వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI



# హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణకు మార్గం సుగమం

కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి చర్చలు ఫలప్రదం
ఎస్బీఐకాప్స్ ను కన్సల్టెంట్‌గా నియమించాలని నిర్ణయం

తెలంగాణ పత్రిక జూన్ 23 : హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-1 స్వాధీనం,ఫేజ్-2 విస్తరణకు సంబంధించిన కీలక అంశాలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో జరిపిన చర్చలు సానుకూల ఫలితాన్నిచ్చాయి. రెండు రోజుల పాటు జరిగిన సమావేశాల్లో ప్రాజెక్టుకు సంబంధించిన ఆటంకాలను మిగతా2లో



# కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేపట్టండి...

- కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలని తుమ్మల, ఉత్తమ్ విన్నపం
- భద్రాచలంకు దేశ, విదేశాల నుంచి భక్తులు వస్తుంటారన్న మంత్రులు
- సానుకూలంగా స్పందించిన రామ్మోహన్ నాయుడు
- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రాంమోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల విజ్ఞప్తి..
- డిల్లీలో కలిసి గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ స్థాపనపై చొరవ తీసుకోవాలని రాంమోహన్ కు రాష్ట్ర ప్రభుత్వం తరపున విజ్ఞప్తి చేసిన మంత్రులు తుమ్మల మరియు ఉత్తమ్..
- భద్రాద్రి రామాలయం దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఎయిర్ పోర్ట్ ..

తెలంగాణ పత్రిక జూన్ 23 ఖమ్మం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేపట్టాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రాశీమోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.మంగళవారం నాడు డిల్లీలో రాశీమోహన్ నాయుడు ను ప్రభుత్వం తరపున మంత్రులు తుమ్మల ఉత్తమ్ కుమార్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం పై చర్చించారు. కొత్తగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతిపాదన చేయగానే స్పందించి ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరపున ఫీజు మిగతా2లో

## సర్కారు బడుల వైపు ప్రజల అడుగులు.. రేవంత్ రెడ్డి పాలనలో పూర్వ వైభవం పొందుతున్న ప్రభుత్వ పాఠశాలలు

తెలంగాణ పత్రిక ప్రతినిధి:
రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన విద్యా సంస్కరణల ఫలితంగా తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలకు మళ్లీ పూర్వ వైభవం వస్తోంది. ఒకప్పుడు విద్యార్థుల కొరతతో మూతపడిన సర్కారు బడులు ఇప్పుడు తిరిగి కళకళలాడుతున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏళ్లుగా మూతబడి ఉన్న పాఠశాలలు ఈ విద్యాసంవత్సరం నుంచి మళ్లీ తెరుచుకుంటుండటం విశేషం. జగిత్యాల జిల్లాలోనే 13 ప్రభుత్వ పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యాయి. గ్రామ పంచాయతీ పాలకవర్గాలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రైవేట్ పాఠశాలల బస్సులు గ్రామాల్లోకి రాకుండా అడ్డుకునే స్థాయిలో ప్రజలు ముందుకొస్తున్నారు. సర్కారీ బడుల అభివృద్ధికి గ్రామస్థులు స్వచ్ఛందంగా సహకరిస్తూ విద్యా విప్లవానికి శ్రీకారం చుడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల పునరుద్ధరణకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రశంసల జల్లు కురుస్తోంది. ప్రభుత్వ విద్యా వ్యవస్థపై పెరుగుతున్న విశ్వాసం తెలంగాణలో విద్యా రంగానికి కొత్త ఊపునిస్తూ, సర్కారు బడుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోంది.

## హైదరాబాద్‌లో భారీ చోరీ

ఏటీఎంకు తెచ్చిన రూ.17 లక్షలు మాయం!




-హైదరాబాద్ ఐఎస్ సదన్‌లో ఏటీఎం నగదు చోరీ
-వ్యాన్ డ్రైవర్ పరారీ.. కుమ్మక్కుపై పోలీసుల అనుమానం
-బైక్‌పై వచ్చి నగదు ట్రంకును ఎత్తుకెళ్లిన దుండగులు

తెలంగాణ పత్రిక :
హైదరాబాద్‌లోని ఐఎస్ సదన్ ప్రాంతంలో పట్ట పగలే భారీ చోరీ చోటు చేసుకుంది. ఏటీఎంలో నింపేందుకు తీసుకు వచ్చిన సుమారు రూ.17 లక్షల నగదును దుండగులు అపహరించారు. ఈ ఘటన జరిగిన వెంటనే క్యాష్ వ్యాన్ డ్రైవర్ కూడా కనిపించకుండా పోవడంతో, ఇది తెలిసిన వారి పనేనని పోలీసులు మిగతా2లో

## రఘునాథపాలెం గిరిజన గ్రామాలకు రూ.110 కోట్లు ఇవ్వండి

-కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ -వరద నీటి కాలువల నిర్మాణానికి నిధుల కోసం విజ్ఞప్తి -37 పంచాయతీల్లో 28 ఏజెన్సీ, గిరిజన గ్రామాలు -శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖ 2

## సీఎం రేవంత్ కోసం కేంద్రమంత్రులతో సమావేశాలు ఏర్పాటు చేశా



-రేవంత్‌రెడ్డి రెండుసార్లు లేఖ రాసినట్లు వెల్లడించిన కిషన్ రెడ్డి
-జూన్ 22న అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేసినట్లు వెల్లడి
-ఇవాళ ఖట్టర్, అశ్విని వైష్ణవ్‌తో సంయుక్త భేటీ జరిగినట్లు తెలిపారు

తెలంగాణపత్రిక:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేసినట్లు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. గత రెండు రోజులుగా ఢిల్లీలో రేవంత్‌రెడ్డి పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యేలా తాను సమన్వయం చేసినట్లు వెల్లడించారు. జూన్ 22న అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం జరిగిందని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఇవాళ కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్‌తో కలిసి మిగతా2లో

## చెన్నూర్ నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు

రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ,కర్మాగార,గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి



తెలంగాణ పత్రిక జూన్ 23 ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి : జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గంలో అన్ని రంగాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ, కర్మాగార,గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు.మంగళవారం జిల్లాలోని కోటపల్లి మండలం లింగన్నపేట, ఏదుల బంధం,సిర్స, రొయ్యలపల్లి,ఆల్గాం, వెంచపల్లి మిగతా2లో

## నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి అరెస్ట్ 2

## లక్నో అగ్నిప్రమాదం.. 2016లో కూల్చివేత ఉత్తర్వులు ఇచ్చి రెండు నెలల్లోనే రద్దు..! 2

## హార్మూజ్ జలసంధిలో రికార్డు స్థాయిలో ఆయిల్ రవాణా 12

## తెలంగాణ హౌసింగ్ బోర్డ్ బంపర్ ఆఫర్..

-హైదరాబాద్‌లో లక్ష ఇళ్ల నిర్మాణానికి భారీ పథకం
-పథకానికి మంచి పేరు సూచిస్తే లక్ష రూపాయల నగదు బహుమతి 2

## రేవంత్ ఏ స్కీమ్ తెచ్చినా.. దాని వెనుక స్కాం ఉంటుంది



రేవంత్ కన్ను మెట్రో భూములపై పడిందన్న కేటీఆర్

2 సొంత మనుషులకు భూములు కట్టబెట్టేందుకే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపణ

# హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణకు మార్గం సుగమం..!

రెండు రోజుల పాటు జరిగిన సమావేశాల్లో ప్రాజెక్టుకు సంబంధించిన ఆటంకాలను తొలగించే దిశగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు.సోమవారం రాత్రి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్,కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డితో సీఎం సమావేశమయ్యారు. అనంతరం మంగళవారం కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నివాసంలో మరో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 విలువ నిర్ధారణ (వాల్యుయేషన్),స్వాధీన ప్రక్రియ, రుణ సేకరణ,రుణ సంస్థ ఎంపిక, ఫేజ్-2 విస్తరణ,నిర్మాణ వ్యయం తదితర అంశాలపై సమగ్ర అధ్యయనం చేసేందుకు ఎస్బీఐకాప్స్ ను కన్సల్టెంట్‌గా నియమిం చాలని ఏకాభిప్రాయానికి వచ్చారు.ఎస్బీఐకాప్స్ సమగ్ర నివేదిక ఆధారంగా మెట్రో ప్రాజెక్టు భవిష్యత్ కార్యాచ రణను రూపొందించనున్నారు.అలాగే ఈ అధ్యయన ప్రక్రియను వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తరఫున ఒక అధికారి,రాష్ట్ర ప్రభుత్వం తరఫున పురపాలక,పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శిని సమన్వయ అధికారులుగా నియమించాలని సమావేశం లో నిర్ణయించారు.ఈ నిర్ణయాలతో హైదరా బాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణ ప్రక్రియ మరింత వేగం పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం చేపట్టండి

గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం పై చర్చించారు. కొత్తగూడెం వద్ద గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతిపాదన చేయగానే స్పందించి ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం సివిల్ ఏవియేషన్ తరపున ఫీజు బులిటీ సర్వే చేసినందుకు రాంమోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు.ఫీజుబులిటీ సర్వే లో ప్రతిపాదిత స్థలం ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం అనువుగా లేనందున మరో స్థలం రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతిపాదన చేశామని అక్కడ త్వరగా ఫీజుబులిటీ సర్వే చేసి, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రి రాంమోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దక్షిణ అయోధ్య గా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని తెలిపారు.

**జాతికి వెలుగులు అందించే సింగరేణి గనులు..**

**హెవీ వాటర్ ప్లాంట్..ఐటీసీ**

బీ. పీ.ఎల్ సంస్థలతో పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అరుదైన ఖనిజ నిక్షేపాలతో అటవీ ప్రాంతంతో ఎకో టూరిజం కు కేరాఫ్ గా నిలిచింది.దేశంలోనే తొలి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ కొత్తగూడెం లో ఏర్పాటు చేశాం.గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణం వల్ల పారిశ్రామికంగా విద్యా పరంగా టూరిజం పరంగా జిల్లా ఎంతో పురోగతి చెందే అవకాశం ఉందని, దేశ విదేశాల నుంచి భద్రాద్రి రామాలయం దర్శనానికి వచ్చే భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో చొరవ తీసుకోవాలని రాంమోహన్ నాయుడు కు మంత్రి తుమ్మల సవివరంగా తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో చేపట్టాల్సిన పనులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. తెలుగు బిడ్డన రాంమోహన్ నాయుడు చొరవతో కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ కల సాకారం కానుందని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు.

# రఘునాథపాలెం గిరిజన గ్రామాలకు రూ.110 కోట్లు ఇవ్వండి

ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలంలో ఏజెన్సీ, గిరిజన గ్రామ పంచాయతీలకు వరద నీటి కాలువలు, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణం కోసం రూ.110 కోట్లు మంజూరు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత-జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. సోమవారం రాసిన ఈ లేఖలో మండలంలోని డ్రైనేజీ సమస్యలను మంత్రి వివరించారు. మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో 28 ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల పరిధిలోకి వస్తాయని మంత్రి తెలిపారు. వర్షాకాలంలో సరైన వరద నీటి కాలువలు లేక ఈ గ్రామాలు తీవ్ర నీటి నిల్వ, పారిశుధ్య సమస్యలను ఎదుర్కొంటున్నాయని, గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా వరద నీటి కాలువలు, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణానికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ పనులకు రూ.110 కోట్లు అంచనా వ్యయం అవుతుందని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన తన నియోజకవర్గ పరిధిలోని ఈ గిరిజన ప్రాంతాలకు సరిపడా స్థానిక వనరులు లేనందున, గ్రామీణాభివృద్ధి లేదా గిరిజన ప్రాంత అభివృద్ధి పథకాల ద్వారా నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని తుమ్మల కోరారు. ప్రతిపాదిత పనులు ఈ గిరిజన ప్రాంతాల్లో పారిశుధ్యం, ప్రజారోగ్యం, జీవన పరిస్థితులు, మొత్తం మౌలిక సదుపాయాలను గణనీయంగా మెరుగుపరుస్తాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. డీపీఆర్‌తో పాటు గ్రామ పంచాయతీల జాబితాను లేఖకు జతచేస్తూ, నిధుల మంజూరుకు సానుకూలంగా స్పందించాలని కేంద్ర మంత్రిని ఆయన అభ్యర్థించారు.

# చెన్నూర్ నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు

జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గంలో అన్ని రంగాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ, కర్మాగార,గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు.మంగళవారం జిల్లాలోని కోటపల్లి మండలం లింగన్నపేట, ఏదుల బంధం,సిర్స, రొయ్యల పల్లి, ఆల్గాం, వెంచపల్లి గ్రామాలలో సి.సి.రోడ్లు, డ్రైనేజీల పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జైపూర్ ఎ.సి.పి.వెంకటేశ్వర్లు, మండల తహసిల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి, డి.సి.సి.ప్రతినిధి రఘునాథ్ రెడ్డి లతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలలో సి.సి. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రతి గ్రామానికి 10 లక్షల చొప్పున కేటాయించి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. లింగన్నపేట గ్రామంలో గతంలో 14 నూతన విద్యుత్ పోల్స్, 4 బోర్ వెల్స్ పనులను దాదాపు 20 లక్షల రూపాయల ఈజీఎస్, ఎస్.డి.ఎఫ్. నిధులతో చేపట్టి ఇప్పుడు 10 లక్షలు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఏదుల బంధంలో 15 లక్షల రూపాయల ఎస్.డి.ఎఫ్., డి.ఎం.ఎఫ్.టి. నిధులతో పనులు చేపట్టడం జరిగిందని,ఆల్గాం, వెంచపల్లి,జనగాం గ్రామాలలో 10 లక్షల రూపాయల చొప్పున కేటాయించి పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని,రేషన్ కార్డులు అందించి సన్నబియ్యం అందించడం జరుగుతుందని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి అనేక పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.విద్యారంగ అభివృద్ధిలో భాగంగా చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో 2 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయడం జరుగుతుందని, 200 కోట్ల రూపాయల వ్యయంతో సి.సి.రోడ్లు, మురుగునీటి వ్యవస్థ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 100 కోట్ల రూపాయల వ్యయంతో అమృత్ 2.0 పథకం ద్వారా ప్రజలకు త్రాగునీరు అందించేందుకు నీటి ట్యాంకులు, పైపులైన్ల ఏర్పాటు పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. 46 కోట్ల రూపాయల వ్యయంతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, వృత్తి విద్య కోర్సులు అందించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయడంతో పాటు విదేశాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెన్నూర్ లో నీటి వనరుల ఏర్పాటుకు 40 కోట్ల రూపాయలతో ప్రత్యామ్నాయ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.వైద్య రంగ బలోపేతం దిశగా కృషి చేస్తూ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, 23 మంది వైద్యులను నియమించి చెన్నూర్ లో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని త్వరలో ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నామని, మందమర్రి ప్రాంతంలో 50 పడకల ఆసుపత్రి పున: ప్రారంభానికి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. సింగరేణి సంస్థను లాభాల బాటలోకి తీసుకువచ్చి 11 వేల కోట్ల రూపాయల లాభాన్ని సాధించడం జరిగిందని తెలిపారు. ఇసుక మాఫియా నియంత్రణపై కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని, సి.సి. కెమెరాలు, వే బ్రిడ్జిల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఆల్గాం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, మూత్రశాలలు,విద్యుత్, ఇతర మరమ్మత్తు పనులపై అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో "సే నో టు డ్రగ్స్" కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని,జిల్లాలో మాదక ద్రవ్యాలు, గంజాయి విక్రయాలపై పోలీసు శాఖ అధికారులు సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ ఏ స్కీమ్ తెచ్చినా.. దాని వెనుక స్కాం ఉంటుంది

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డికి ఒక్కటే ఎజెండా ఉందని, అది మెట్రో భూముల స్కామ్ అని మండిపడ్డారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన కేటీఆర్, 'రేవంత్ రెడ్డి కన్నంతా మెట్రో భూముల మీదే పడింది. ఏ స్కీమ్ తెచ్చినా దాని వెనుక ఒక స్కామ్ పక్కా ఉంటుంది" అని ఆరోపించారు. మెట్రో సమీపంలో 280 ఎకరాల విలువైన భూములు ఉన్నాయని, వీటి విలువ సుమారు రూ.30 వేల కోట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి ఈ భూములను తన అన్నదమ్ములు, బావమరుదులు, అల్లుళ్లకు కట్టబెట్టడానికే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. దీని కోసం ప్రజలపై రూ.14 వేల కోట్ల భారం మోపారని విమర్శించారు."కేసీఆర్ ప్రభుత్వం 72 కిలోమీటర్ల మెట్రోను బ్రహ్మాండంగా నిర్మించింది. ఎయిర్‌పోర్ట్ మెట్రో టెండర్లు కూడా పూర్తి చేసి, 2023 జూన్-జులైలోనే పనులు ప్రారంభించాల్సి ఉండగా, రేవంత్ రెడ్డి వచ్చి ఎయిర్‌పోర్ట్ మెట్రోను రద్దు చేశారు. ఇది తుగ్లక్ నిర్ణయం" అని కేటీఆర్ మండిపడ్డారు. ఎయిర్‌పోర్ట్ మెట్రో కొనసాగి ఉంటే ఈ పాటికి పూర్తి అయి ఉండేదని చెప్పారు. భూసేకరణ సమస్య కూడా లేకుండా, ఔటర్ రింగ్ రోడ్డును అనుసంధానం చేసి ట్రాఫిక్ సమస్యలు తగ్గించాలని ఆలోచన చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రస్తుతం కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి ఢిల్లీలో కొత్త డ్రామా మొదలుపెట్టారని, మళ్లీ మెట్రో పనులు ప్రారంభించాలంటే 2028లో కేసీఆర్‌ను మళ్లీ సీఎంగా చేయాల్సి ఉంటుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## లక్నో అగ్నిప్రమాదం.. 2016లో కూల్చివేత ఉత్తర్వులు ఇచ్చి రెండు నెలల్లోనే రద్దు..!

ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో సంభవించిన ఘోర అగ్నిప్రమాదంలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. అలీగంజ్‌లోని ఒక మూడంతస్తుల వాణిజ్య భవనంలో సోమవారం మధ్యాహ్నం మంటలు చెలరేగడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. మృతుల్లో అత్యధికులు యానిమేషన్ శిక్షణా కేంద్రానికి హాజరైన విద్యార్థులే కావడం గమనార్హం. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంతో భవన నిర్మాణం నిబంధనలు ఉల్లంఘనలు మరియు నియంత్రణ వైఫల్యాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. అక్రమ నిర్మాణం కారణంగా ఈ భవనాన్ని కూల్చివేయాలని 2016 మే 10న లక్నో డెవలప్‌మెంట్ అథారిటీ ఆదేశాలు జారీ చేసింది. అయితే, కేవలం రెండు నెలల వ్యవధిలోనే, అంటే అదే ఏడాది జులై 5న ఆ ఆదేశాలను అధికారులు రద్దు చేయడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సరైన విచారణ జరపకుండానే నోటీసులు ఇచ్చారని, భవన నిర్మాణం నిబంధనలకు అనుగుణంగానే జరిగిందని అప్పటి యాజమాన్యం ప్రభుత్వ ఉత్తర్వులను సవాలు చేయడంతో, ఆ కూల్చివేత ఆదేశాలు రద్దయ్యాయి. కాగా, 1980వ సంవత్సరం నుంచి ఈ స్థలం పలువురి చేతులు మారుతూ వచ్చిందని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ దుర్ఘటనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్రంగా స్పందించారు.

# హైదరాబాద్‌లో భారీ చోరీ..

హైదరాబాద్‌లోని ఐఎస్ సదన్ ప్రాంతంలో పట్టపగలే భారీ చోరీ చోటుచేసుకుంది. ఏటీఎంలో నింపేందుకు తీసుకువచ్చిన సుమారు రూ.17 లక్షల నగదును దుండగులు అపహరించారు. ఈ ఘటన జరిగిన వెంటనే క్యాష్ వ్యాన్ డ్రైవర్ కూడా కనిపించకుండా పోవడంతో, ఇది తెలిసిన వారి పనేనని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఓ క్యాష్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీకి చెందిన సిబ్బంది ఏటీఎంలో నగదు నింపేందుకు వ్యాన్‌లో అక్కడికి చేరుకున్నారు. సిబ్బంది ఏటీఎం కియోస్క్‌లోకి వెళ్లిన సమయంలో, ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి వ్యాన్‌లో ఉన్న నగదు పెట్టెను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే డ్రైవర్ కూడా పరారీ కావడంతో, అతడు దొంగలతో కుమ్మక్కై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ప్రధానంగా డ్రైవర్ పాత్రపైనే దృష్టి సారించి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అత్యంత రద్దీగా ఉండే ప్రాంతంలో పట్టపగలే ఈ తరహా చోరీ జరగడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## సీఎం రేవంత్ కోసం కేంద్రమంత్రులతో సమావేశాలు ఏర్పాటు చేశా

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేసినట్లు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. గత రెండు రోజులుగా ఢిల్లీలో రేవంత్‌రెడ్డి పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యేలా తాను సమన్వయం చేసినట్లు వెల్లడించారు. జూన్ 22న అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం జరిగిందని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఇవాళ కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, అశ్విని వైష్ణవ్‌తో కలిసి మరో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. ఈ సమావేశాలు సానుకూల వాతావరణంలో జరిగాయని పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి తనకు రెండుసార్లు లేఖ రాసి కేంద్ర మంత్రులతో భేటీకి అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు. కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణ ప్రతినిధిగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఎప్పుడూ కృషి చేస్తానని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణకు సంబంధించిన అభివృద్ధి అంశాల్లో తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

## నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి అరెస్ట్

నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కొమ్మూరి మల్లారెడ్డి ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే మల్లారెడ్డిని అరెస్ట్ చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణల నేపథ్యంలో మంగళవారం ఏసీబీ అధికారులు మల్లారెడ్డి నివాసంతో సహా బంధువులు, బినామీలకు చెందిన 10 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. సోదాల్లో 4 గృహాలు, కమర్షియల్ భవనం, 8 ఓపెన్ ప్లాట్లు సహా 10.23 ఎకరాల వ్యవసాయ భూమిని అధికారులు గుర్తించారు. 3.31 లక్షల రూపాయలు, 50 లక్షల రూపాయల బ్యాంక్ డిపాజిట్లను ఫ్రీజ్ చేశారు. భార్య, కుటుంబసభ్యుల పేర్లపై ఉన్న మూడు బ్యాంక్ లాకర్లను గుర్తించారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు తేలిన నేపథ్యంలో ఏసీబీ అధికారులు మల్లారెడ్డిని అరెస్ట్ చేశారు. ఆయనను నాంపల్లి కోర్టులో హాజరుపర్చనున్నారు. కాగా, మూడు సంవత్సరాల క్రితం ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా మల్లారెడ్డి విధుల్లో చేరారు. ఇటీవల ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు అయ్యింది. దీంతో ఈరోజు తెల్లవారుజామునే ప్రత్యేక బృందాలు నిజామాబాద్ చేరుకుని.. అక్కడి ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు

## తెలంగాణ హౌసింగ్ బోర్డ్ బంపర్ ఆఫర్..

హైదరాబాద్ నగరంలో ప్రతిపాదిత భారీ గృహ నిర్మాణ పథకానికి ఆకర్షణీయమైన పేరును సూచించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రజలను కోరుతోంది. ఈ పథకానికి అత్యుత్తమ పేరును సూచించిన విజేతకు తెలంగాణ గృహనిర్మాణ సంస్థ (టీజీహెచ్‌బీ) రూ. లక్ష నగదు బహుమతిని ప్రకటించింది. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) ప్రాంతంలో లక్ష ఇళ్లను నిర్మించాలన్నది ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఈ భారీ ప్రాజెక్టుకు సముచితమైన పేరును నిర్ణయించే ప్రక్రియలో ప్రజలను భాగస్వామ్యులను చేయాలని భావిస్తున్నట్లు హౌసింగ్ బోర్డ్ వైస్-చైర్మన్ గౌతమ్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు తమ సూచనలను స్తష్టస.శీటటఉషెఖుశ్రీ అనే అధికారిక ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా సమర్పించవచ్చు. పేర్లను పంపేందుకు 2026 జూన్ 28వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు.

## హర్మూజ్ జలసంధిలో రికార్డు స్థాయిలో ఆయిల్ రవాణా

అమెరికా, ఇరాన్‌ల మధ్య ఇటీవల కుదిరిన ఒప్పందం ఆశించిన సత్ఫలితాలనిస్తోందని, హర్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణా తిరిగి భారీగా పుంజుకుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. సోమవారం ఒక్కరోజే ఈ జలసంధి గుండా 1.9 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా జరిగిందని, ఇది ఒక సంచలనాత్మక రికార్డు అని ఆయన ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. "నిన్న హర్మూజ్ జలసంధి నుంచి 19 మిలియన్ బ్యారెళ్ల చమురు సరఫరా అయింది. ఇది ఒక సరికొత్త రికార్డు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ప్రపంచం ఇప్పుడు మరింత సురక్షితమైన ప్రదేశంగా మారింది" అని ఆయన పేర్కొన్నారు. ఈ సానుకూల పరిణామంతో అంతర్జాతీయ విపణిలో ముడి చమురు ధరలు తగ్గాయి. నిరసనలు, తప్పుడు ప్రచారాల ద్వారా అమెరికా విజయాన్ని తక్కువ చేసే ప్రయత్నాలు జరిగినప్పటికీ, భవిష్యత్తులో అత్యున్నత స్థాయి అణు తనిఖీలకు ఇరాన్ అంగీకరించిందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యకలాపాలపై పారదర్శకతకు ఇది భరోసా ఇస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒకవేళ ఇరాన్ ఈ నిబంధనలకు కట్టుబడి ఉండకపోతే, తదుపరి చర్చలకు తావుండదని హెచ్చరించారు. ఇరాన్ చేసిన కొన్ని ప్రతిపాదనల ప్రాతిపదికన, ఎలాంటి దిగ్బంధనం లేకుండా హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు తాను అంగీకరించినట్లు ట్రంప్ వివరించారు.

# భూదందాలకు కొమ్ముకాస్తున్నది ఎవరు

-కబ్జా భూములను స్వాధీనం చేసుకుని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి: సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్

తెలంగాణ పత్రిక దమ్మపేట, జూన్ 23




దమ్మపేట మండల కేంద్రంలోని మల్లారం సరిహద్దుల్లో ఉన్న సర్వే నెం. 589/బై పరిధిలోని పలు ఎకరాల భూములు అక్రమ కబ్జాలకు గురయ్యాయని, ఈ భూదందాలకు కొమ్ముకాస్తున్నది ఎవరో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ డిమాండ్ చేసింది. పార్టీ నాయకులు విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, దమ్మపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో సొంతంగా సుమారు 110 గజాల స్థలం ఉన్నవారికే ఇళ్ల మంజూరు జరిగిందని పేర్కొన్నారు. అయితే గ్రామంలో సెంటు భూమి కూడా లేని నిరుపేద కుటుంబాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయని, అలాంటి వారికి ఇళ్ల స్థలాలు కేటాయించి గృహాలు నిర్మించి ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నిరుపేదలకు ఇల్లు ఇవ్వడం అంటే వారి సొంత స్థలంలో ఇల్లు నిర్మించడం మాత్రమే కాదని, స్థలం లేని కుటుంబాలకు ప్రభుత్వం భూమి కేటాయించి ఆ స్థలంలో గృహ నిర్మాణం చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం భూ కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకుంటే వేలాది మంది పేదలకు ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం అవుతుందన్నారు. మల్లారం సరిహద్దుల్లోని భూములపై జరుగుతున్న అక్రమాలను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుని, ఆక్రమిత భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుండా భూకబ్జాదారులకు అండగా నిలిస్తే సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. అవసరమైతే కబ్జా భూములను స్వాధీనం చేసుకుని నిజమైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేసే పోరాటానికి పార్టీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఇల్లు లేని పేదలకు న్యాయం చేయాలి.. భూదందాలను అరికట్టాలి.. ఆక్రమిత భూములను పేదల సంక్షేమానికి వినియోగించాలి అని ప్రజలు కోరుతున్నారు.

# ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు





-ఖండించిన కాంగ్రెస్ నాయకులు
-ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

ఆత్మకూరు, జూన్ 23 ,(తెలంగాణ పత్రిక):

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పై ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల అధ్యక్షులు రేవూరి జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజల ఆశీస్సులతో ఎన్నికై నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి గురించి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాంఛనీయమని, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. వ్యక్తిగత స్థాయికి దిగజారి మాట్లాడటం బాధాకరమన్నారు. రేవూరి ప్రకాశ్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నారని పేర్కొన్నారు. ఇలాంటి నాయకుడిపై అసత్య ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా నాయకులు, కమలాపురం రమేష్, ఏరుకొండ రవీందర్ గౌడ్, ముద్దం సాంబయ్య, కక్కెర్ల రాజు, కంచ రవి, రేవూరి జయపాల్ రెడ్డి, బయ్య కుమారస్వామి, కాడబోయిన రమేష్, ఉడత రాజేందర్, రాయరాకుల శంకర్, పొనుగోటి సత్యనారాయణ, ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, పీఏసీఎస్ చైర్మన్లు, మండల స్థాయి నాయకులు, యువ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు. నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.

# మొబైల్ కోర్టును పునరుద్ధరించాలి

-భద్రాచలం బార్ అసోసియేషన్ డిమాండ్
-మొబైల్ కోర్టు వల్ల ప్రజలకు త్వరిత న్యాయం అందుతుంది

భద్రాచలం, జూన్ 23: తెలంగాణ పత్రిక




భద్రాచలంలోని మొబైల్ కోర్టును రద్దు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. ఆర్.టి. నంబర్ 70ను వెంటనే ఉపసంహరించుకుని మొబైల్ కోర్టును పునరుద్ధరించాలని భద్రాచలం బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే శ్రీ తెల్లం వెంకట్రావును కలిసి వినతిపత్రం సమర్పించారు. మొబైల్ కోర్టు కొనసాగడం వల్ల మారుమూల ప్రాంతాల ప్రజలకు న్యాయం మరింత చేరువ అవుతుందని, చిన్న చిన్న కేసుల పరిష్కారం వేగవంతం అవుతుందని వారు పేర్కొన్నారు. మొబైల్ కోర్టుల ద్వారా ప్రజలు కోర్టులకు దూర ప్రాంతాల నుంచి పదేపదే రావాల్సిన ఇబ్బందులు తగ్గుతాయని, సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా అవుతాయని బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు, వృద్ధులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు న్యాయ సేవలు సులభంగా అందుబాటులోకి వస్తాయని అన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి కూడా మొబైల్ కోర్టులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. మొబైల్ కోర్టు రద్దు నిర్ణయాన్ని పునఃపరిశీలించి వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ ముఖ్యమంత్రి గారు, రెవెన్యూ శాఖ మంత్రి గారికి కూడా వినతులు అందజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే 2019 తర్వాత ఎన్రోల్ అయిన న్యాయవాదులందరికీ ప్రభుత్వం వెంటనే హెల్త్ కార్డులు జారీ చేయాలని బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, సంయుక్త కార్యదర్శి తాత లలిత, మాజీ అధ్యక్షులు కోట దేవదానం, సీనియర్ న్యాయవాదులు గోడపర్తి నాగరాజు, రావి రామ్మోహన్, అవులూరి సత్యనారాయణ, కె. అరుణ, నర్మదా, పడిసిరి శ్రీనివాసరావు, ఎం.వి. రమణ, విజ్జగిరి రవితేజ, కొత్తపల్లి రాంబాబు, గాయత్రి తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

-ఫీజులు అధికంగా వసూలు చేసే ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి.
-ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి.
-ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కొప్పుల రవీందర్.

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూన్ 23




భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) భద్రాచలం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో విద్యా రంగ సమస్యలపై మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) రమాదేవి కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ భద్రాచలం డివిజన్ కార్యదర్శి కొప్పుల రవీందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థులు, తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని అన్నారు. పెరుగుతున్న ఫీజులను నియంత్రించేందుకు ప్రభుత్వం వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు పాఠ పుస్తకాలు, నోట్‌బుక్స్, టైలు, బెల్టులు, షూస్ తదితర వస్తువులను తమ సంస్థల ద్వారానే కొనుగోలు చేయాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తేవడం సరికాదని పేర్కొన్నారు. ఇటువంటి దోపిడీ విధానాలను ప్రభుత్వం అరికట్టి, విద్యార్థులు ఎక్కడైనా కొనుగోలు చేసుకునే స్వేచ్ఛ కల్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంకా అనేక మౌలిక సమస్యలు కొనసాగుతున్నాయని, తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు, ఫర్నిచర్, విద్యుత్, శుభ్రత వంటి కనీస సౌకర్యాలను ప్రభుత్వం వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం ద్వారానే పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించి, ప్రభుత్వ విద్యను పరిరక్షించే దిశగా తక్షణ చర్యలు తీసుకోవాలని ఎంఈఓకు అందజేసిన వినతిపత్రంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చందువర్ధన్ సాయికుమార్ కిషోర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# వెల్దుర్తి మండల నూతన ఎంపీడీఓగా జెట్టి విఘ్నేశ్వర్

-ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని వెల్లడి

వెల్దుర్తిమండల ప్రతినిధి,జూన్ 23 (తెలంగాణ పత్రిక):



వెల్దుర్తి మండల నూతన మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)గా జెట్టి విఘ్నేశ్వర్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మండల కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జెట్టి విఘ్నేశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంతో పాటు మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ పారదర్శక పరిపాలన అందించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# చెక్ డ్యాంలో గుర్తుతేలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం

పాపన్నపేట, జూన్ 23: (తెలంగాణ పత్రిక)



సుమారు (55) సం రాల వయసు గల ఓ వృద్ధురాలి మృతదేహం ఏడుపాయల చెక్ డ్యాం లో లభ్యమైనట్లు పాపన్నపేట ఎస్ ఐ శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం చెక్ డ్యాం లో ఓ వృద్ధురాలి మృతదేహం గమనించిన స్థానికులు పాపన్న పేట పోలీసులకు సమాచారం అందజేయడం తో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని వెలికి తీసి మృతురాలి ఆచూకీ కోసంపరిశీలించగా ఎలాంటి ఆచూకీ లభ్యం కాలేదని. మృతురాలి దేహం పై బ్లూ కలర్ నైటీ తోపాటు, చెవులకు రేడిమెట్ కమ్మలు, ముక్కు పుడక ఉందని. మృతురాలి ఫోటోఆధారంగామృతురాలిని గుర్తించిన వారు పాపన్న పేట ఎస్ ఐ శ్రీనివాస్ గౌడ్ చరవాణి 87126 57920, రూరల్ సీఐ కృష్ణమూర్తి 87126 57883 చరవాణి లకు సంప్రదించాలని వారు కోరారు.

# విత్తనమేళ కార్యక్రమాన్ని ప్రారంభించిన చింతలపూడి శ్రావణి







భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూన్ 23

కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ 21 వ డివిజన్ పరిధిలోని రైతు వేదిక లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు వేదికలో విత్తన మేళా కార్యక్రమం ను ప్రారంభించిన 21 వ డివిజన్ కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి కొత్తగూడెం మార్కెట్ కమిటీ చైర్మన్ బాణోత్ లాల్ సింగ్ ,కొత్తగూడెం ప్రాథమిక సహకార సంఘ చైర్మన్ మండే వీర హనుమంతరావు కార్పొరేటర్ మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలు అర్హత కలిగిన లైసెన్స్ డీలర్ల వద్దనే కొనుగోలు చేసి సరైన రశీదు పొందాలని విన్నపించారు, పూర్తి వర్షపాతం నమోదు అయ్యాకనే విత్తనాలు విత్తుకోవాలి అని సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు,స్థానిక డీలర్లు,మండల రైతులు తదితరులు పాల్గొన్నారు. తదనంతరం ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా విచ్చేసిన గౌరవ కొత్తగూడెం నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ లాల్ సింగ్ నూతనంగా ఎన్నికైన సందర్భంగా వారికి స్థానిక కార్పొరేటర్ దంపతులు శాలువా కప్పి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY తెలుగు దిన పత్రిక
నిజం మా నిజన్



# అధికలోడు.... ప్రమాదాలకు తోడు



ముధోల్:23జూన్(తెలంగాణ పత్రిక)

సామర్థ్యానికి మించి ఆటోలు, ట్రాక్టర్ల ల లో అధిక లోడు (ఓవర్‌లోడ్) తో ప్రయాణించడం చట్టరీత్యా నేరం. మంగళవారం మండల కేంద్రంలోని నాయాబాది చౌరస్తా వద్ద ఓ ఆటోలో పరిమితికి మించిన లోడ్ తో తీసుకెళ్తున్న దృశ్యం "తెలంగాణ పత్రిక "కెమెరా కు క్లిక్ అనిపించింది. పరిమితికి నుంచి వెళుతున్న ఆటోను పలువురు చూస్తూ ప్రాణాల మీదికి తెచ్చే ప్రమాదకరంగా ఉందని అంటున్నారు. ఏ కొద్దిపాటి ఆటో అదుపు తప్పడం, బోల్తా పడడం లేదా ఇతర వాహనాలను ఢీకొట్టడం వంటి జరిగే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి ఓవర్ లోడ్ తో వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలని, నిర్ణీత సామర్థ్య ప్రమాణాల మేరకు వాహనాలను అనుమతించాలని పలువురు కోరుతున్నారు.

# మహిళ రైతులకు సబ్సిడీ సోయా విత్తనాల పంపిణీ

-ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్



ముధోల్:23జూన్(తెలంగాణ పత్రిక)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళ సంఘాల రైతులకు 100 శాతం సబ్సిడీపై సోయా విత్తనాలను పంపిణీ చేస్తుందని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయం శాఖ (ఎన్ఎంఈ -వోఎస్ ) ఆధ్వర్యంలో మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల మహిళ రైతులకు సోయా విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు ఆయిల్ సాగులో సోయా పంటను వేసుకోవాలన్నారు. సోయా పంటను భవిష్యత్తు అవసరాల కోసం ఉపయోగించుకోవాలని అన్నారు. మొత్తం మండలానికి 1147 సోయా బస్తాలు వచ్చినట్లు తెలిపారు. సన్న, చిన్న కారు రైతులను దృష్టిలో ఉంచుకొని అర్హులైన మహిళా రైతులకు విత్తనాలు అందజేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్,ముధోల్ సర్పంచ్ షబానా ఏజాజోద్దీన్, ఏవో రచన,పీఏసిఎస్ చైర్మన్ సాయిరాం, డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, సర్పంచులు కల్లెడ కిష్టయ్య, ఆత్మ స్వరూప్,గంగాధర్, బీజేపీ మండల అధ్యక్షులు కోరి పోతన్న,నాయకులు సతీష్ రెడ్డి, తాటివార్ రమేష్, శ్రీనివాస్,సాయినాథ్, దత్తు, ఇమ్రాన్ ఖాన్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## హలో బీసీ.. చలో భువనగిరి పోస్టర్ ఆవిష్కరణ



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 23, తెలంగాణ పత్రిక

జూలై 5న తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న "రాజ్యాధికార సమరభేరి -- హలో బీసీ.. చలో భువనగిరి" మహాసభ పోస్టర్‌ను సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు.పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోదం రజనీకుమార్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా, జిల్లా అధ్యక్షుడు దండు వినోద్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న నాయకత్వంలో నిర్వహించనున్న ఈ మహాసభకు రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.లక్ష మందికి పైగా ప్రజలతో ఈ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో బీసీ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ కృషి చేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు కలికోట రేణుక, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు కొడూరి శ్రీహరి, పట్టణ అధ్యక్షుడు ఆరుకల రమేష్, మహిళా పట్టణ అధ్యక్షురాలు బిట్ల జ్యోత్స్న, ప్రధాన కార్యదర్శి చెట్టిపల్లి నరేందర్, మండల అధ్యక్షుడు మొగిళ్ల బాబు, కొంకటి శ్రీధర్, చెన్నోజి విద్యాసాగర్, దూడం సత్యం, గాంధీబాబు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి







-పాల్వంచ గురుకుల పాఠశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు
-ఎస్పీ రోహిత్ రాజ్

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూన్ 23

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో గల బాలుర గురుకుల పాఠశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా ఎస్పి రోహిత్ రాజు పాఠశాల విద్యార్థుల నుండి గౌరవ వందనాన్ని స్వీకరించి,అనంతరం వన మహోత్సవంలో భాగంగా పాఠశాల పరిధిలో మొక్కలు నాటారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమంలో పాల్గొని ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత దేశానికి వెన్నుముక లాంటివారు, క్షణకాలపు ఆనందం కోసం మత్తు పదార్థాల వైపు ఆకర్షితులై, తమ బంగారు భవిష్యత్తును, తల్లిదండ్రుల ఆశలను చేతులారా నాశనం చేసుకుంటున్నారని, మాదక ద్రవ్యాల వల్ల శారీరకంగా మానసికంగా ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని తెలియజేశారు. విద్యార్థులు స్నేహితుల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలని, వైజ్ఞానిక పరిజ్ఞానం పిల్లలకు అవసరమని, సినిమాలలోని మంచిని గ్రహించి చెడుని వదిలేయాలని, చదువుల్లో లేదా వ్యక్తిగత జీవితంలో ఒత్తిడి నుండి ఉపశమనానికై క్రీడలపై ఆసక్తి చూపాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తన కదలికలను గమనిస్తూ ఉండాలని సూచనలు చేశారు. అనంతరం సైబర్ నేరాల గురించి మాట్లాడుతూ అత్యాశకు పోయి త్వరితగతిన డబ్బును సంపాదించాలనే ఆలోచనతో చాలామంది సైబర్ నేరాల బారిన పడి కష్టపడి సంపాదించిన నగదును కోల్పోతున్నారని,చదువుకున్నవారే ఎక్కువమంది సైబర్ నేరాలు బారిన పడుతున్నారని తెలిపారు.ఓటీపి ట్రాప్,ఆన్లైన్ ట్రేడింగ్,సోషల్ మీడియాల ద్వారా ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాల గురించి వివరించారు. విద్యార్థినులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని, సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని, మహిళల భద్రతపై పలు సూచనలు చేశారు. మహిళలకు, విద్యార్థినులకు రక్షణగా జిల్లాలో షీ టీమ్స్ పనిచేస్తున్నాయని, అత్యవసర సమయాల్లో 1098 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయాలని సూచనలు చేశారు. అనంతర రోడ్డు భద్రతా నియమాలను పాటించడంలో స్వీయ క్రమశిక్షణ కలిగి ఉంటే చాలావరకు రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని, హెల్మెట్ వినియోగం,సీటు బెల్ట్ ప్రాధాన్యత,డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాల గురించి వివరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్,ర్యాష్ డ్రైవింగ్,సెల్‌ఫోన్ డ్రైవింగ్,రాంగ్ రూట్,సిగ్నల్ జంపింగ్,ఓవర్ లోడ్ వలన కలిగే ప్రమాదాల గురించి వివరించారు. సుమారు 300మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పి ఆర్. సతీష్ కుమార్, ఎస్బిఐ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, పాల్వంచ సీఐ సతీష్, ఎక్సైజ్ సీఐ ప్రసాద్, పోలీసు అధికారులు, పాఠశాల మరియు కళాశాల, అధ్యాపకులు, ఉపాధ్యాయులు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సన్న వడ్లు సాగు చేయాలి

-పంట మార్పిడి చేయాలి
-సహజ వ్యవసాయ పద్ధతులు పాటించాలి
-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 23, తెలంగాణ పత్రిక





రైతులు పంట మార్పిడిలో భాగంగా సన్న వడ్లు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాల కింద రైతు వేదికల్లో విత్తన మేళా ఈ నెల 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు కార్యక్రమంలో భాగంగా వీర్నపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించగా, ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ హాజరై ప్రారంభించారు. పలువురు రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. రైతు వేదిక ఆవరణలో మొక్క నాటారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యాలయాల్లో మధ్యాహ్న భోజనం, హాస్టళ్లలో సన్న బియ్యం వినియోగిస్తున్నారని,రేషన్ షాప్ లలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో స్వల్పకాలం పంటలు వేయాలని సూచించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ సూచించిన బీపీటీ 5204, కే ఎన్ ఎం 7715, జై శ్రీ రామ్,ఆర్ ఎన్ ఆర్ 15048, డబ్ల్యూ జీ ఎల్ 44, కే ఎన్ ఎం 1638 హెచ్ ఎంటీ సోన సన్న వడ్లు సాగు చేయాలని తెలిపారు. లైసెన్స్ ఉన్న షాప్ ల నుంచి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని, రసీదు పొందాలని సూచించారు. దానిని జాగ్రత్తగా భద్రపర్చాలని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగు కింద ఆయిల్ పామ్ సాగు చేయాలని సూచించారు. 30 ఏండ్ల వరకు దిగుబడి వస్తుందని, సబ్సిడీపై మొక్కలు, బిందు సేద్యం పరికరాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా నర్మెట్ట వద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారని గుర్తు చేశారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటిన మూడు ఏండ్ల తర్వాత దిగుబడి వస్తుందని, అంతర పంటలు సాగు చేయవచ్చని, అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. సహజ వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, రైతులు ఆ వైపు మళ్ళాలని పిలుపు నిచ్చారు. సహజ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఇక్కడ సిబ్బంది ఉన్నారని తెలిపారు. రైతులకు వ్యవసాయ అధికారులు సహకారం అందిస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, మండల ప్రత్యేక అధికారి క్రాంతి, తహసీల్దార్ నారాయణరెడ్డి, సర్పంచ్ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి: జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

-మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 23, తెలంగాణ పత్రిక






విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వీర్నపల్లి మండల కేంద్రం లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం వంటగదిని సందర్శించి బియ్యం నాణ్యతను తనిఖీ చేశారు. మెనూ చార్ట్ ప్రకారం విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాల వివరాలను అడిగి తెలుసుకున్నారు.స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన పప్పులు, నూనె, నెయ్యి తదితర సరుకుల నాణ్యత, గడువు తేదీలను పరిశీలించారు. ఆహార పదార్థాల నిల్వ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.విద్యార్థులకు తప్పనిసరిగా మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా చూడాలని ఆదేశించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తరగతులకు క్రమం తప్పకుండా హాజర య్యేలా చూడాలని సూచించారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకొని మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని తెలిపారు.ఈ తనిఖీలో మండల ప్రత్యేక అధికారి క్రాంతి, తహసీల్దార్ నారాయణ రెడ్డి, సర్పంచ్ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల పట్టణానికి బైపాస్ రోడ్డు

-అంతర్గాం, అంబారీపేట ల వద్ద అండర్ పాస్ లు మంజూరు.

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక)జూన్ 23



జగిత్యాల జిల్లా ప్రజలకు కేంద్రం మరో శుభవార్త తెలియజేసిందని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి తెలిపారు. జగిత్యాల కరీంనగర్ జాతీయ రహదారి అభివృద్ధి పనుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని ఆయన పేర్కొన్నారు.అంబారిపేట్ మరియు అంతర్గాం గ్రామాల వద్ద ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం కోసం తాను కేంద్ర రహదారులు రవాణా శాఖకి తీసుకెళ్లిన అంశంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గారి నుంచి అధికారిక స్పందన వచ్చినట్లు తెలిపారు.జగిత్యాల కరీంనగర్ రహదారిని 4 లేన్లుగా విస్తరించడంతో పాటు జగిత్యాల పట్టణానికి బైపాస్ నిర్మాణ ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఆయన వెల్లడించారు. అంతేకాకుండా అంతర్గాం, అంబారీపేట గ్రామాల వద్ద అండర్ పాస్ ల నిర్మాణానికి సైతం ఆమోదం లభించిందన్నారు.ఈ పనులు పూర్తయిన అనంతరం ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.జగిత్యాల జిల్లా అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో మరిన్ని ప్రాజెక్టులు తీసుకురావడానికి నిరంతరం కృషి కొనసాగిస్తానని ఎంపీ అరవింద్ ధర్మపురి పేర్కొన్నారు.జిల్లా ప్రజల తరపున కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ఈనెల 5వ తేదీన ముగ్గురిని సజీవ దహనం చేసిన నిందితుని కఠినంగా శిక్షించాలి

-బీసీ జేఏసీ మిర్యాలగూడ పట్టణ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్

మిర్యాలగూడ ప్రతినిధి//జూన్ 23:(తెలంగాణ పత్రిక):-



మిర్యాలగూడ పట్టణంలోని కలాల్ వాడలో 45వ వార్డ్ ఈనెల 5వ తేదీన ముగ్గురిని సజీవ దహనాని కారణమైన నిందితుడు శ్రీకాళహస్తి శిరీష్ కుమార్ ను కఠినంగా శిక్షించాలని బీసీ జేఏసీ మిర్యాలగూడ పట్టణ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ ఆధ్వర్యంలో స్థానిక మిర్యాలగూడ పట్టణంలో అమరవీరుల స్థూపం వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో సజీవ దహనమైన వారు వనం చంద్రమ్మ, నక్క లక్ష్మణ్, నక్క ప్రణీత్ ల ఫ్లెక్సీ బ్యానర్ తో ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ల ద్వారా వెంటనే విచారణ జరిపించి నిందితుడు ను కఠినంగా శిక్షించాలని నిరసన నినాదాలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా బంటు మాట్లాడుతూ భార్య ధనమ్మ పై కోపంగా శ్రీకాళహస్తి శిరీష్ కుమార్, అభం శుభం తెలియని అత్త వనం చందమ్మ, పిల్లలు నక్క లక్ష్మణ్, నక్కా ప్రణీతులను అర్ధరాత్రి పెట్రోల్ పోసి తగలబెట్టడం సహించరానిదని అని అన్నారు. పిల్లలు పెరిగాక ప్రేమ పేరుతో తల్లిని వివాహం చేసుకొని అమ్మమ్మ పిల్లలను దహనం చేయడం సమాజంలో అందరినీ కలిసి వేసిందన్నారు. ఇటువంటి నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా వెంటనే విచారణ జరిపించి శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇలాంటి నిందితులకు బెయిల్ రాకుండా న్యాయవాదులు ప్రయత్నం చేయాలని లేకుంటే అతడు బయటికి వచ్చి ధనమ్మ పై ఇబ్బందులకు గురి చేయడం జరుగుతుందన్నారు. కాబట్టి కి మొన్నటికి మొన్న ధనమ్మ ఇటీవల వన్ టౌన్ పోలీస్ స్టేషన్ బయట పెట్రోల్ పోసుకొని నా భర్త బయటకు వస్తే నన్ను చంపేస్తాడని పెట్రోల్ పోసుకోవడం జరిగిందన్నారు. నాకు కూడా ప్రాణహాని ఉన్నదని ధనలక్ష్మి ఆవేదన చేయడం జరిగింది. కాబట్టి ఇలాంటి నిందితులను బెయిల్ రాకుండా న్యాయవాదులు ప్రయత్నం చేయాలని వెంటనే బహిరంగ శిక్షపడేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి జిల్లా ఉపాధ్యక్షులు లావురి క్రాంతి కుమార్, వెంకటేష్, పవన్, శ్రీకాంత్, సందీప్, సునీల్, నాగార్జున, నాగయ్య, లావణ్య, రజిత, ప్రియాంక, సునీత మాలతి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# బిఎల్ఓ,బిఎల్ఏ లకు ఎస్ఐఆర్ ట్రైనింగ్ కార్యక్రమం

ఊర్కొండ జూన్ 23 (తెలంగాణ పత్రిక)



నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ రైతు వేదికలో మంగళవారం రోజు ఎస్ఐఆర్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు.మండల ఎమ్మార్వో యూసుఫ్ అలీ ఆధ్వర్యంలో బిఎల్ఓ, బిఎల్ఏ లకు ఎస్ఐఆర్ పై ట్రైనింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ స్పెషల్ ఎంటెన్సీ రివిజన్ ను బిఎల్ఓ,బిఎల్ఏ చాలా జాగ్రత్తగా మ్యాపింగ్ చెయ్యాలని కోరారు.ఈ మ్యాపింగ్ కొరకు ప్రతి ఇంటికి మూడు సార్లు వెళ్ళాలని, ఓటర్లకు అర్థమయ్యే విధంగా ఫారం ఎలా నింపాలని ప్రజలకు తెలియజేయాలని కోరారు.బిఎల్ఓ,బిఎల్ఏలు ఒక అండర్స్టాండింగ్ మీద ఈ మ్యాపింగ్ పూర్తి చేయాలని కోరారు. ఈనెల జూన్ 25 నుండి వచ్చేనెల జూలై 24 వరకు ఈ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. 2002 ఎస్ఐఆర్ ప్రకారం ఇప్పుడున్న సంబంధీకులకు మ్యాపింగ్ చేయాలని కోరారు. మ్యాపింగ్ కానీ ఓటర్ కార్డులు శాశ్వతంగా తొలగించడం జరుగుతుందని అందుకని ఈ ప్రక్రియను సక్రమంగా నిర్వహించి అందరి ఓటర్ కార్డులను మ్యాపింగ్ చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ బాధ్యతలను బిఎల్ఏ బాధ్యతలను అలాగే 2002 ఎస్ఐఆర్ ప్రకారం ఎనిమినేషన్ ఫామ్ ఇలా ఫిల్ చేయాలనే విషయాలపై చర్చించడం జరిగింది. ఈ ట్రైనింగ్ యొక్క ముఖ్య ఉద్దేశం ఇప్పుడున్న ఓటర్ కార్డులను తమ 2002 లో ఓటర్ కార్డులు ఉన్న కుటుంబ సభ్యుల ఓటర్ కార్డులతో మ్యాపింగ్ చేయడం కొరకనీ. దీంతో చనిపోయిన వారి ఓటర్ కార్డులు మరియు రెండుసార్లు నమోదు అయిన ఓటర్ కార్డులను అలాగే రెండు చోట్ల ఓట్లు వేసే వారికి చెక్ పెట్టడానికి ఈ ఎస్ఐఆర్ పనిచేస్తుందని అన్నారు. ఎన్నిమరేషన్ ఫామ్ లో ముందుగానే ఓటర్ల యొక్క వివరాలు ఉంటాయని వాటిని తమ సంబంధికులు ఓటర్ ఐడి తో మ్యాపింగ్ చేయడమే బిఎల్ఎ,బిఎల్ఓ ల యొక్క ముఖ్యమైన పని అని ఈ సందర్భంగా అన్నారు. గ్రౌండ్ లెవెల్ లో సర్వే చేసిన తథానంతరం వెంటనే తమకు కేటాయించిన బిఎల్ఓ యాప్ లో ఎనిమరేషన్ ఫామ్ స్కాన్ చేసి అప్లోడ్ చేయాలని దాంతో బిఎల్ఓ లెవెల్ ఓటర్ ఐడి మ్యాపింగ్ పూర్తవుతుందని అన్నారు. తర్వాత పై అధికారులు ఆ యొక్క డాటా ను సమీక్షించి ప్రక్రియను పూర్తి చేస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, మండల నాయకులు బిఎల్ఓ, బిఎల్ఏలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెహ్రూ నగర్‌కు జాతీయస్థాయి స్వచ్ఛ విద్యాలయ గుర్తింపు

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 23, తెలంగాణ పత్రిక





కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ విద్యాలయ-2026 పురస్కారాల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెహ్రూ నగర్ జాతీయస్థాయి గుర్తింపు పొందిన ఏకైక పాఠశాలగా నిలిచింది.రాష్ట్ర స్థాయిలో ఎంపికైన పది పాఠశాలల్లో ఒకటిగా నిలిచిన ఈ పాఠశాలను జాతీయస్థాయి పరిశీలకులు సందర్శించి పలు అంశాలను పరిశీలించిన అనంతరం ఈ గుర్తింపును ప్రకటించారు.ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వం పాఠశాలల్లో తాగునీటి నిర్వహణ, మరుగుదొడ్ల నిర్వహణ, హ్యాండ్ వాష్ సదుపాయాలు, పరిసరాల పరిశుభ్రత, ఇంకుడు గుంతలు, తడి-పొడి చెత్త నిర్వహణ, బడి తోట, విద్యార్థుల సంఘాలు, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు తదితర అంశాలను పరిశీలించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ర్యాంకులు అందజేస్తుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాసాల హరిప్రసాద్ మాట్లాడుతూ... ఈ ఘనత సాధించడంలో సహకరించిన ఉపాధ్యాయ బృందం, రిటైర్డ్ హెచ్ఎం, విద్యార్థులు, మధ్యాహ్న భోజన సిబ్బంది, స్కావెంజర్, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, ఏఏపీసీ, ఎస్ఏడీసీ సభ్యులు, పాఠశాల శ్రేయోభిలాషులు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ఎస్సీఈహెచ్ఎం, ఎంఈఓ, ఎస్ఓ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

# చిరుమర్తి రైతు వేదిక లో ప్రత్యేక విత్తన మేళా... శివరాం కుమార్

మాడ్గులపల్లి//నల్గొండ//జూన్ 23:(తెలంగాణ పత్రిక):-



మాడుగులపల్లి మండలంలోని చిరుమర్తి రైతువేదిక నందు మంగళవారం నాడు విత్తన మేళా కార్యక్రమం ప్రారంభించబడింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి యం. శివరాం కుమార్ మాట్లాడుతూ మాడుగులపల్లి మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 23-06-2026 నుండి 30-06-2026 వరకు ప్రత్యేక విత్తన మేళా (సీడ్ మేళా) నిర్వహించబడుతోంది. ఈ కార్యక్రమం మండలంలోని రైతు వేదికలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా కొనసాగుతుందని తెలియచేసారు. అదే విధంగా రైతులు మార్కెట్ డిమాండ్ కి అనుగుణంగా ప్రభుత్వం సూచనలకు మేరకు బిపిటీ-5204, జై శ్రీరామ, కెఎన్ఎం-1638, కెఎన్ఎం -7715, ఆర్ఎన్ఆర్- 15048, హెచ్ఎంటి సోనా, డబ్ల్యు జి ఎల్-44 వంటి సన్న రకాల వరి సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రత్యేక బోనస్ అందిస్తున్నందున, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదే విధంగ సాంప్రదాయ యూరియా, ఎరువులు తగ్గించి నానో యూరియా నానో డి.ఏ.పి వాడాలని, మరియు రసాయనిక మందుల వాడకం తగ్గించి సేంద్రీయ వ్యవసాయం వైపు అడుగు వేయాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్, మాడుగులపల్లి మండల వ్యవసాయ అధికారి ఎం. శివరాం కుమార్, వ్యవసాయవిస్తరణ అధికారి వి. పార్వతి, రైతులు, విత్తన డీలర్స్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు రూ.27 కోట్ల 39 లక్షలు

-ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్



ముధోల్:23జూన్(తెలంగాణ పత్రిక)

నియోజకవర్గ అభివృద్ధి పనులకు.27 కోట్ల 39 లక్షలు మంజూరైనట్లు ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ స్పష్టం చేశారు. మంగళవారం ముధోల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ కింద మంజూరైన రూ.27 కోట్ల 39 లక్షల నిధులతో గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీలు, గోదాములు, వివో బిల్డింగ్ ల పనులు కొనసాగుతున్నాయన్నారు. రూ 3 కోట్ల నిధులతో మండల కేంద్రమైన ముధోల్ లో సిసి రోడ్ల పనులను జరుగుతున్నట్లు పేర్కొన్నారు.తన హాయంలో అభివృద్ధి పనులకు పెద్దపీట వేయడమే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. కొందరు అభివృద్ధిని చూసి ఓర్వలేక నిధులు తీసుకురాలేదని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ముధోల్, అష్ట, ఎడ్ బిడ్, ముద్గల్, రామ్ టెక్, గ్రామాలకు గోదాముల నిర్మాణానికి సంబంధించిన మంజూరు పత్రాలను సర్పంచ్ లకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్,ముధోల్ సర్పంచ్ షబానా ఏజాజోద్దీన్, ఉప సర్పంచ్ కోరి లావణ్య సాయినాథ్,పీఏసిఎస్ చైర్మన్ సాయిరాం, డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, సర్పంచులు కల్లెడ కిష్టయ్య, ఆత్మ స్వరూప్,గంగాధర్, బీజేపీ మండల అధ్యక్షులు కోరి పోతన్న,నాయకులు సతీష్ రెడ్డి, తాటివార్ రమేష్,దత్తు, ఇమ్రాన్ ఖాన్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్డ్ కులాల లా పట్టభద్రులకు 3 సంవత్సరాల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 23, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్‌లో మూడు సంవత్సరాల శిక్షణ పొందేందుకు 2026-27 సంవత్సరానికి గాను షెడ్యూల్డ్ కులాలకు చెందిన అర్హత గల లా పట్టభద్రుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి డాక్టర్ వి. రవీందర్ రెడ్డి తెలిపారు.రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన అర్హులైన అభ్యర్థులు 20-06-2026 నుంచి 31-07-2026 వరకు ఆన్‌లైన్‌లో తెలంగాణ ఈ-పాస్ వెబ్‌సైట్ హ్ట్జూం:7/వశ్రీఖఅస్త్రుఖఅఖవజూఖం.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.శిక్షణకు ఎంపికైన లా పట్టభద్రులకు నెలకు రూ.3,000 చొప్పున స్టైపండ్‌తో పాటు పుస్తకాలు, ఫర్నీచర్ కొనుగోలు కోసం రూ.50,000 ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు.

**ముఖ్యమైన తేదీలు**

- ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభ తేదీ: 20-06-2026
- దరఖాస్తుల చివరి తేదీ: 31-07-2026
- అభ్యర్థుల ఎంపిక తేదీ: 10-08-2026


**అర్హతలు**

1. అభ్యర్థి న్యాయశాస్త్రంలో పట్టభద్రుడై ఉండాలి.
2. బార్ కౌన్సిల్ సభ్యత్వం కలిగి ఉండాలి. బార్ కౌన్సిల్ ఐడెంటిటీ కార్డు జత చేయాలి.
3. 10వ తరగతి నుంచి గ్రాడ్యుయేషన్ వరకు విద్యార్హత ధ్రువపత్రాలు జత చేయాలి.
4. మీసేవ ద్వారా పొందిన షెడ్యూల్డ్ కులాల కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాలి.
5. మీసేవ ద్వారా పొందిన రూ.2 లక్షల లోపు ఆదాయ ధ్రువీకరణ పత్రం జత చేయాలి.
6. ఆధార్ కార్డు జిరాక్స్ సమర్పించాలి.
7. జాతీయ బ్యాంకు ఖాతా పాస్‌బుక్ జిరాక్స్ జత చేయాలి.

అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలను గెజిటెడ్ అధికారి ద్వారా ధ్రువీకరించి, ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు సంబంధిత సర్టిఫికెట్లను రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయంలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయం (1వ అంతస్తు, రూమ్ నం. ఖీ-26)లో 31-07-2026 సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలని తెలిపారు.

## చండూరు మండలంలో ఏబివిపి బంద్ విజయవంతం

చండూర్ తెలంగాణ పత్రిక జూన్ 23



అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏ బి వి పి ఆధ్వర్యంలో చండూరు మండలంలో బంద్ విజయవంతం అయ్యింది ఈ కార్యక్రమంలో ఎబివిపి నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో బలోపేతం చేయాలని పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేయడం జరిగింది అదేవిధంగా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో అరికట్టాలని ఇష్ట రాజ్యాంగ ప్రవేట్ పాఠశాలలో పుస్తకాలు కాపీలు, బెల్ట్, టై , ఫీజు అధిక వసుల్లో జరుపుతున్నారని వీటి మీద ప్రభుత్వం చర్యలు తీసుకోవాలనీ అనుమతిలేని చర్యలు తీసుకోవాల ఎంఈఓ, డి ఈ ఓ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పెండ్యాల సాయి, సంపత్, శివ, వంశీ, ఉదయ్, గణేష్, ఉదయ్, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు

# చట్టం పై అవగాహన కోసమే భారత రాజ్యాంగం బుక్స్ పంపిణీ

-దళిత సంఘం నాయకులు బంగారు సాయిలు



కోటగిరి తెలంగాణ పత్రిక జూన్ 23.

నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం కోటగిరి మండల కేంద్రంలోని భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బాబాసాహెబ్ రచించిన గ్రంథాలు, చట్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, చట్టం పై గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించటం కోసం భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన గ్రంథలను బుక్కులను ప్రతి ఒక్కరికి పంపిణీ చేస్తూ చట్టంపై అవగాహన కల్పించేందుకు కోటగిరి మండల కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టి మండలంలోని మహిళలకు బుక్కులు పంపిణీ చేసినట్టు ప్రముఖ సామాజిక కార్యకర్త దళిత సంఘం నాయకులు బంగారు సాయిలు తెలిపారు. ప్రతి ఒక్కరూ అన్ని మతాలకు సంబంధించిన బుక్కులు చదవడం పై ఉన్న శ్రద్ధ భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బాబాసాహెబ్ రచించిన చట్టం బుక్కులపై శ్రద్ధ పెట్టి చదవాలని, ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. అందులో భాగంగా బుక్కులను పంపిణీ చేస్తున్నట్టు పేర్కొన్నారు . ఇప్పటివరకు 50 వేలకు పైగా బుక్కులు పంపిణీ చేశానని తెలుపుతూ , ఇలాటివి మరెన్నో బుక్కులు పంపిణీ చేస్తానని ఆయన అన్నారు. ఆయనతో పాటు దళిత సంఘం బహుజన సంఘం నాయకులు మహిళలు పాల్గొన్నారు.

# మర్రి రాజారత్నం పార్ధివ దేహానికి నివాళి ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బిఎల్ఆర్



మిర్యాలగూడ ప్రతినిధి//జూన్ 23:(తెలంగాణ పత్రిక):-

మిర్యాలగూడ కాంగ్రెస్ నాయకులు మర్రి మీడియా అధినేత మర్రి ఇలియాస్ సోదరుడు నకిరేకల్ కాంగ్రెస్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మర్రి రాజారత్నం గుండెపోటుతో మృతి చెందడం పట్ల ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మరియు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మరియు డీసీసీ అధ్యక్షులు పున్నా కైలాష్ నేత తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈరోజు నకిరేకల్ నియోజకవర్గంలోని కట్టంగూర్ గ్రామంలో ఉన్న వారి స్వగృహానికి వెళ్లిన ఎమ్మెల్యేలు, మర్రి రాజా రత్నం పార్ధివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ మర్రి రాజారత్నం కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన నాయకుడని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి, కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొన్నారు. భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ నియోజకవర్గం ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# పట్టుదలతో చదివితే..విజయం ఖాయం

-నేవీ ఉద్యోగం సాధించిన సాయి కుమార్ ను సన్మానించిన ఎమ్మెల్యే

ముధోల్:23జూన్(తెలంగాణ పత్రిక)



యువత పట్టుదలతో చదివితే.. విజయం సాధించడం ఖాయ మని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని ముక్తాదేవి గల్లీకి చెందిన కారగిరి సాయినాథ్ -రుక్మల కుమారుడు కారగిరి సాయికుమార్ ఇటీవల ఇండియన్ నేవీలో ఉద్యోగం సాధించాడు. మంగళవారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే రామారావు పటేల్ కారగిరి సాయినాథ్ ను శాలువాతో ఘనంగా సన్మానించి మిఠాయిలను తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ముధోల్ నుండి నేవీలో ఉద్యోగం సాధించడం ఎంతో గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు.యువత చిన్ననాటి నుండి మంచి విద్యను అభ్యసించినట్లయితే అనుకున్న లక్ష్యాలను సాధిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షబానా ఏజాజోద్దీన్, ఉప సర్పంచ్ కోరి లావణ్య -సాయి నాథ్, పిఏసిఎస్ డైరెక్టర్ సుదర్శన్,మండల అధ్యక్షులు కోరి పోతన్న, నాయకులు సతీష్ రెడ్డి,తాటివార్ రమేష్, ధర్మపురి శ్రీనివాస్,ఇమ్రాన్ ఖాన్ తోపాటు తదితరులు పాల్గొన్నారు

# ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలి

-ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్

నిర్మల్ జిల్లా ప్రతినిధి జూన్ 23 (తెలంగాణ పత్రిక)

మంగళవారం బాసర మండల కేంద్రంలో, ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కలిగేలా 2 కే రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు. జెండా ఊపడం ద్వారా ర్యాలీని ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ ర్యాలీ బాసర మండలంలోని పలు వీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలంతా స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అధికారులంతా ఎస్ఐఆర్ ప్రక్రియ పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా సమగ్ర ఓటర్ జాబితా తయారవుతుందని తెలిపారు. భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ప్రక్రియను ప్రజలంతా పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఎస్ ఐఆర్ ప్రక్రియపై ఇప్పటికే ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. నిజమైన ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కును కోల్పోకుండా పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. ఈ ర్యాలీలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, తహసిల్దార్ పవన చంద్ర, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థుల నైపుణ్యాలు పెరిగేలా విద్యా బోధన ఉండాలి

-జిల్లా కలెక్టర్ ఖవేశ్ మిశ్రా.

నిర్మల్ జిల్లా ప్రతినిధి జూన్ 23 (తెలంగాణ పత్రిక)

ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల నైపుణ్యాలు పెరిగేలా విద్యా బోధన సాగాలని జిల్లా కలెక్టర్ ఖవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని (కేజీబీవీ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతిగదిలోని విద్యా ర్థులతో కలెక్టర్ పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగారు. వారితో లెక్కలు చేయించారు. విద్యార్థులు పాఠాలను సులువుగా అర్థం చేసుకునే మెలుకువలు నేర్చుకోవా లన్నారు. సామాజిక అంశాల్లో భాగస్వామ్యం అవుతూ పలు విషయాల్లో అవగాహన పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు నేర్పిస్తున్న చదువు,



అందిస్తున్న భోజనం సక్రమంగా ఉన్నాయో లేవో వారిని అడిగి తెలుసుకున్నారు. అధికారులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, పిల్లలకు చదువుతో పాటు, నైపుణ్యాభివృద్ధి తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు వచ్చే సందేహాలు నివృత్తి చేస్తూ ఉండాలని తెలిపారు. ప్రతి రోజు అన్ని పూటల కామన్ మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని చెప్పారు. విద్యార్థులకు వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. అనంతరం ఖానాపూర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు పరిశీలించారు. రెవెన్యూ అంశాలకు సంబంధించిన దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలని చెప్పారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఏవైనా భూ సమస్యలు ఉన్నాయేమో అని అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలలో డిఈఓ భోజన్న, తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో రాధా రాథోడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంక్ ఖాతా లేని వారికి సువర్ణ అవకాశం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా ఉచితంగా జీరో బ్యాలెన్స్ ఖాతాలు

-సద్వినియోగం చేసుకోవాలని వేముల మార్కండేయులు పిలుపు

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 23, తెలంగాణ పత్రిక

బ్యాంకు ఖాతాలు లేవని ఎవరూ బాధపడాల్సిన అవసరం లేదని ప్రముఖ సామాజిక సేవా కార్యకర్త, రైతుల నేతన్న మనోధైర్య కేంద్రం కోఆర్డినేటర్ వేముల మార్కండేయులు తెలిపారు.సామాన్య ప్రజలు, పేద వర్గాలు, రైతులు, నేతన్నల కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా సులభంగా ఉచితంగా జీరో బ్యాలెన్స్ ఖాతాలు ప్రారంభించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకింగ్ సేవలు ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి రావడంతో పాటు ఆర్థిక అక్షరాస్యత పెరగాలనే ఉద్దేశంతో ఈ అవకా శం కల్పిస్తున్నట్లు పే ర్కొన్నారు. ఇప్పటికీ చాలామంది బ్యాంకు ఖాతాలు లేకుండా ఉన్నారని, ప్రతి ఒక్క రూ తప్పనిసరిగా బ్యాం కు ఖాతా కలిగి ఉండాలని సూచించారు. బ్యాంకు ఖాతాల ద్వారా ప్రభుత్వ పథకాలు, ఆర్థిక సేవలు సులభంగా పొందవచ్చని తెలిపారు.ఖాతా ప్రారంభిం చుకోవాలనుకునే వారు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఆధార్ కార్డు జిరాక్స్, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్‌తో డిజిటల్ బ్యాంకు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.మరిన్ని వివరాల కోసం వేముల మార్కండేయులు, రైతుల నేతన్న మనోధైర్య కేంద్రం కోఆర్డినేటర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. సంప్రదించవలసిన ఫోన్ నంబర్: 9948394061 ఈ అవకాశాన్ని సామాన్య ప్రజలు, రైతులు, నేతన్నలు, అన్ని వర్గాల వారు సద్వినియోగం చేసుకోవాలని వేముల మార్కండేయులు కోరారు.



# మండల రైతులకు ముఖ్య గమనిక

-రైతు వేదికల్లో వారం రోజుల పాటు 'విత్తన మేళా'

మంగపేట, జూన్ 23 (తెలంగాణ పత్రిక):

వానాకాలం సాగుకు సిద్ధమవుతున్న రైతు సోదరులకు నాణ్యమైన, ధృవీకరించిన విత్తనాలను ఒకే చోట అందుబాటులో ఉంచేందుకు మంగపేట మండల వ్యవసాయ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. మండలంలోని అన్ని రైతు వేదికల కేంద్రంగా జూన్ 23వ తేదీ నుండి జూన్ 30వ తేదీ వరకు 'విత్తన మేళా'ను నిర్వహిస్తున్నామని మండల వ్యవసాయ శాఖ అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు.

**సన్న రకాల సాగుపై ప్రత్యేక దృష్టి**

ఈ వానాకాలం సీజన్‌లో రైతులు లాభసాటిగా ఉండేందుకు ప్రభుత్వం సన్న రకం వరి సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా, రైతులు సాగులో నాణ్యతను పాటించాలని, ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల సన్న వడ్లను మాత్రమే ఎంచుకోవాలని అధికారులు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన ఈ ఏడు రకాలను సాగు చేసిన రైతులకు మాత్రమే, పంట కొనుగోలు సమయంలో క్వింటాలుకు అదనంగా బోనస్ చెల్లించడం జరుగుతుందని స్పష్టం చేశారు.



**బోనస్ వర్తించే ఏడు రకాల సన్న వడ్లు ఇవే:**

రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు ఈ కింది రకాలను మాత్రమే ఎంచుకోవాలని అధికారులు కోరారు. బి.పి.టి-5204, ఆర్.ఎన్.ఆర్ - 15048,హెచ్.ఎమ్.టి సోనా, కె.ఎన్.ఎమ్ - 1638,జైశ్రీరామ్,డబ్ల్యూ.జి.ఎల్ - 44,కె.ఎన్.ఎమ్ - 7715

**రైతులకు అధికారుల సూచనలు:**

మండలంలోని రైతు సోదరులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ కోరుతోంది. రైతులు తమ పరిధిలోని రైతు వేదికలను సందర్శించి, విత్తన మేళాలో నాణ్యమైన విత్తనాలను సేకరించుకోవాలని సూచించారు. విత్తనాల ఎంపిక, సాగు పద్ధతులు మరియు ఇతర వ్యవసాయ సంబంధిత సందేహాల కోసం స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ విత్తన మేళా ద్వారా రైతులకు విత్తనాలపై అవగాహన కల్పించడమే కాకుండా, నకిలీ విత్తనాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

# విశ్వహిందూ పరిషత్ వేములవాడ పట్టణ నూతన కమిటీ ఎన్నిక

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 23, తెలంగాణ పత్రిక

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విశ్వ హిందూ పరిషత్ వేములవాడ పట్టణ నూతన కమిటీని గాయత్రీ మాత ఆలయం లో ఎన్నుకోవడం జరిగింది నూతనముగా ఎన్నికయిన కమిటీ బాధ్యతలు స్వీకరించారు. నూతన కమిటీ ఈ సందర్భంగా దేశం కోసం ధర్మం కోసం విశ్వ హిందూ పరిషత్ కృషి చేస్తుంద్దని హిందువుల నూ సంగటితం చేసి హిందూ ధర్మం పరిరక్షణ కూ కృషి చేస్తామని ఈ సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ వేములవాడ నూతన పట్టణ కమిటీ తెలియజేసినది ఈ కమిటీ లో అధ్యక్షులు పల్లె శ్యాంసుందర్ రెడ్డి, కార్యదర్శి గుండోజి గోపాల్, ఉపాధ్యక్షులు చేకూర్తి నవీన్,తోట అజయ్, సహకారదర్శి పుల్లూరి ఆంజనేయులు, సామాజిక సమరత జక్కం శివప్రసాద్, బజరంగ్ సహా సంయోజక్ హరచారి శ్రీరామ్ శర్మ,ఎన్నిక కావడం జరిగింది ఈ కార్యక్రమం లో నూతన పట్టణ కమిటీ,జిల్లా సహా కార్యదర్శులు గడప కిషోర్ రావు, నాగుల రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# మిర్యాలగూడ పట్టణంలోని రైతు వేదికలలో విత్తన మేళా





-రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించటమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ ప్రతినిధి//జూన్ 23:(తెలంగాణ పత్రిక):-

నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో ఏర్పాటు చేసిన విత్తన మేళ ను ఎమ్మెల్యే ఘనంగా ప్రారంభించారు. వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతులకు నాణ్యమైన విత్తనాల అందుబాటును కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం రైతు వేదికలలో నిర్వహిస్తున్న విత్తన మేళా కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 23 నుండి 30వ తేదీ వరకు నిర్వహించబడుతున్న విత్తన మేళాలో రైతులకు అవసరమైన వరి విత్తనా లు, పప్పు ధాన్యాల విత్తనాలు, సోయాబీన్, కూరగాయుల విత్తనాలు, నానో యూరియా, నానో డి.ఏ.పీ. తదితర వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులు ధృవీకరించబడిన నాణ్యమైన విత్తనాలను వినియోగి ంచడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మిర్యాలగూడ క్లస్టర్ పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పంటలకు అవసరమైన విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని, వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని సూచించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. రైతుల ఆదాయ వృద్ధి, వ్యవసాయాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జీయూకేటీ బాసర, మహబూబ్‌నగర్ క్యాంపస్‌ల మూడో విడత అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి

నిర్మల్ జిల్లా ప్రతినిధి జూన్ 23 (తెలంగాణ పత్రిక)

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) బాసర మరియు మహబూబ్‌నగర్ క్యాంపస్‌లకు సంబంధించి, 2026-27 విద్యా సంవత్సరానికి గాను మిగిలిపోయిన 159 సీట్లకు మూడో విడత అడ్మిషన్ల ప్రక్రియ ఈరోజు (జూన్ 23) అత్యంత పారదర్శకంగా, క్రమశిక్షణతో కొనసాగింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో క్యాంపస్ ప్రాంగణం సందడిగా మారింది. ఇక్కడి సాక్ బిల్డింగ్ ఆడిటోరియంలో విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన (కౌన్సిలింగ్) విజయవంతంగా జరిగింది. రెండు క్యాంపస్‌లకు సంబంధించి ఒకే చోట ఉమ్మడిగా కౌన్సిలింగ్ నిర్వహించడం ద్వారా విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఏ. గోవర్ధన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, "మీరు సాధించిన ఈ విజయం మీ కఠిన శ్రమకు నిదర్శనం. ఆర్జీయూకేటీ కేవలం డిగ్రీలను ఇచ్చే సంస్థ మాత్రమే కాదు, మీలోని అద్భుతమైన నైపుణ్యాలను నింపే ఒక ప్రయోగశాల. రాబోయే ఆరేళ్లు మీ జీవితంలో అత్యంత కీలకమైనవి, కాబట్టి ఇక్కడ లభించే అవకాశాలను అందిపుచ్చుకుని, సాంకేతిక రంగంలో ప్రపంచ స్థాయికి ఎదగాలి" అని పిలుపునిచ్చారు. క్యాంపస్ లో మొబైల్ వాడకంపై పిలుపు: ఇదే



వేదికపై వీసీ ప్రొఫెసర్ ఏ. గోవర్ధన్ మొబైల్ ఫోన్ల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఒక అమూల్యమైన సందేశాన్ని ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ---విశ్వ విద్యాలయాల్లో మొబైల్ ఫోను ప్రవేశం వల్ల అనేక ప్రయోజనాలతో పాటు, దానిని సరియైన విధానంలో వినియోగించకపోతే అనేక సమస్యలు వస్తాయని, విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, జ్ఞాపక శక్తికి మొబైల్ విఘాతం కలిగిస్తుందని, ముఖ్యంగా తరగతి గదుల్లో, పరీక్ష కేంద్రాలలో, గ్రంథాలయాలు, భోజనశాలల్లో మొబైల్ వాడకం తగ్గించగలిగితే విద్యార్థులకు ఎంతో సమయం మిగులుతుంది అని అన్నారు. అన్నిటికన్నా ముఖ్యంగా భోజనశాలల్లో మొబైల్ వాడకం అనేక ఆరోగ్య సమస్యలను తీసుకొస్తుందని చెబుతూ "భోజనం చేసేటప్పుడు మొబైల్ ఫోన్లు ఉపయోగించడం వల్ల మెదడు పరధ్యానంలో పడి, ఆకలి, కడుపు నిండిన భావనకు సంబంధించిన సహజ సంకేతాలను సరిగ్గా అందుకోలేదు. ఊబకాయం, మధుమేహం, గ్యాస్ట్రిక్ వంటి దీర్ఘకాలిక రోగాలకు కారణమవుతుంది. ఫోన్ స్క్రీన్‌లపై ఉండే బ్యాక్టీరియా వల్ల ఆహారం కలుషితమై ఇన్ఫెక్షన్ల ముప్పు పెరగడమే కాకుండా, విద్యార్థులలో ఏకాగ్రత లోపించి క్రమంగా అదొక స్క్రీన్ వ్యసనంగా మారుతుంది. అంతేకాకుండా, భోజన సమయంలో డిజిటల్ పరధ్యానం మానసిక ఒత్తిడిని పెంచి, కుటుంబ సభ్యుల మధ్య పరస్పర సంభాషణలను, సామాజిక అనుబంధాలను దెబ్బతీస్తుంది. కాబట్టి, శారీరక-మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి భోజనశాలలను 'మొబైల్ రహిత ప్రాంతాలు'గా మార్చడం, ఫోన్లను పక్కన పెట్టి శ్రద్ధతో (మైండ్ ఫుల్ ) తినడం ఎంతో అవసరం. 'ఆహారం శరీరానికి, సంభాషణ మనస్సుకు పోషణ' అనే సూత్రాన్ని పాటిస్తూ, ప్రతి ఒక్కరూ భోజన సమయాన్ని కేవలం ఆహార ఆస్వాదనకు మరియు ఆత్మీయ పలకరింపులకు మాత్రమే కేటాయించాలి" కాబట్టి కొత్తగా వచ్చే పిల్లలు వీలైనంతగా మొబైల్ వాడకాన్ని తగ్గించి చదువులపై శ్రద్ధ పెడితే వారి భవిష్యత్తు బంగారుమయం చేసుకోవాలని అని హితవు పలికారు. సెల్ ఫోన్ల వల్ల కలిగే దుష్ప్రభావాలను అంతగా విడమరిచి చెప్పిన వీసీ ప్రసంగానికి విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంతో సానుకూలంగా స్పందించి, కరతాళధ్వనులతో తమ హర్షాన్ని వ్యక్తపరిచారు.

# విద్యార్థులకు మంచి విద్యాబోధన అందించేందుకే ఫ్రీ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటు





-మంచి విద్యకు ప్రాథమిక పాఠశాలలే పునాది
-చిన్నారుల విద్యే భవిష్యత్‌కు బాట
-నాణ్యమైన విద్యే లక్ష్యం
-ప్రాథమిక విద్యకు పెద్దపీట
-విద్యార్థుల అభివృద్ధికి విద్యాశాఖ కృషి
-విద్యాబోధనలో నాణ్యతే ప్రధాన లక్ష్యం
-జిల్లా విద్యాధికారి రాజు

వెల్దుర్తిమండల ప్రతినిధి,జూన్ 23 (తెలంగాణ పత్రిక):

ఈజిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో 63 వేల 935 మంది విద్యార్థిని విద్యార్థులువిద్యనుఅభ్యసిస్తున్నారని జిల్లా అధికారి రాజు తెలిపారు. మంగళవారం మండలంలోనిశేరిలాలోనూతనంగా మంజూరైన ఫ్రీ ప్రైమరి స్కూల్ నుడిఈఓప్రారంభించారు.అనంతరం విద్యార్థులకు సామూహిక అక్షర అభ్యాసాన్ని నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 90 ఫ్రీ ప్రైమరీ స్కూళ్లుమంజూరుమంజూ రయ్యాయని ఈ పాఠశాల నిర్వహణకు ఒక టీచర్ ఒక ఆయా పోస్టు కలిపి 180 మంజూరయ్యాయని తెలిపారు.టీచర్లు,ఆయలను వారి విద్య అర్హతను బట్టి ఎంపిక చేసామని పోస్టుల నియామకం కోసం జిల్లా కలెక్టర్ కు ప్రతిపాదనలు పంపమని అప్రూవల్స్ రావాల్సిందని డీఈవోతెలిపారు ఫ్రీప్రైమరి ఓకో పాఠశాల నిర్వాహనకు లక్ష చొప్పున 90 లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు పాఠశాలలకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలుపంపిణీ అయ్యాయని యూనిఫాంలు రావాల్సిందన్నారు. జిల్లాలో 273 పాఠశాలలలో అక్షయ పాత్ర ద్వారా మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు.నాలుగేళ్ల పిల్లలను యూకేజీలో అడ్మిషన్లు ఇచ్చి వారికి విద్యను అందించడమే ఫ్రీ ప్రైమరీ స్కూల్ లముఖ్య ఉద్దేశం అన్నారు. ఒక్కో



పాఠశాలలో 25 మంది పిల్లలను భర్తీ చేసి ఫ్రీ ప్రైమరీ స్కూల్ నడిపించడం జరుగుతుందన్నారు కార్యక్రమంలో ఏఎమ్ఓ సుదర్శన మూర్తి మండల విద్యాధికారి బుచ్చయ్య నాయక్ కాంప్లెక్స్ హెచ్ఎం సాంబయ్య పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రణీద్. సర్పంచ్ లావణ్య రవి ఉప సర్పంచ్ నవీన్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## రజక సంఘ భవనం, దోబీఘాట్‌ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 23, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి కొదురుపాక రజక సంఘం సభ్యులు బోయినపల్లి మండల అధ్యక్షుడు సునీల్ యాదవ్ ఆధ్వర్యంలో చొప్పదండి శాసనసభ్యులు మేడిపెల్లి సత్యం కలిసి వినతి పత్రం అందజేశారు.రజక సంఘ భవన నిర్మాణానికి, అలాగే దోబీఘాట్‌ల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. సంఘ సభ్యుల సమస్యలను విన్న ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## పోతంగల్ ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షులుగా నబీబ్



పోతంగల్ తెలంగాణ పత్రిక జూన్ 23.

పోతంగల్. మండల కేంద్రంలోని వివిధ గ్రామపంచాయతీలో ఉప సర్పంచ్ లుగా నియమితులైన ఉపసర్పంచ్ లందరూ కలిసి మండల ఉప సర్పంచ్ల ఫోరం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా నబీబ్ పోతంగల్,, ఉపాధ్యక్షులుగా హట్కర్ సతీష్ పిఎస్ఆర్ నగర్,,మైత్రి హౌసాజీ కార్యదర్శిగా సోంపూర్,, కాశేవార్ భీంరావు కోశాధికారిగా దోమలేడిగి,, కే. దశరథ్ సలహాదారులుగా కల్లూరు,, సిహెచ్. కవిత చంద్రకాంత్ సలహాదారులుగా సుంకిని,, ఇస్లావత్ పక్షిరా నాయక్ సలహాదారులుగా జల్లాపల్లి ఫారం నియమితులయ్యారు. అనంతరం ఎన్నికైన కమిటీ సభ్యులందరికీ శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఎన్నిక సందర్భంగా ఫోరం ఉపాధ్యక్షులు నబీబ్ మాట్లాడుతూ... నాపై నమ్మకం ఉంచి మండల ఉప సర్పంచ్ల ఫోరం ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కమిటీ సభ్యులతో పాటు వివిధ గ్రామాల ఉపసర్పంచ్ లకు ప్రత్యేక కృతజ్ఞత ధన్యవాదాలు తెలిపారు.గ్రామాలలో ఏ సమస్య వచ్చిన ఫోరం సభ్యులతో చర్చించి మండలంలోని వివిధ గ్రామా పంచాయతీలలో ఉన్న సమస్యలను పరిష్కరించుటకు నా వంతు కృషి సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ఉపసర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ--బోయినపల్లి మార్గంలో ధర్మపురికి నేరుగా బస్సుల కోసం ఎమ్మెల్యేకు వినతి పత్రం

-ప్రజల అవసరాలను పరిగణలోకి తీసుకుని బస్సులు మంజూరు చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 23, తెలంగాణ పత్రిక

వేములవాడ నుంచి బోయినపల్లి, అనంతపల్లి, నల్లగొండ మార్గం ద్వారా ధర్మపురికి నేరుగా వెళ్లే బస్సులను ఏర్పాటు చేయాలని కోరుతూ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కలిసి వినతి పత్రం అందజేశారు.ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా నేరుగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సానుకూలంగా స్పందించి సంబంధిత మార్గంలో బస్సుల మంజూరుకు చర్యలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో బోయినపల్లి మండల అధ్యక్షుడు సునీల్ యాదవ్, గంగాధర లక్ష్మణ్, మండల కార్యదర్శి ఆలువల ధర్మయ్య, ఏముండ్ల రమేష్, జాగిరి రమేష్, జాగిరి వెంకటేష్, నేరెళ్ల మునేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ నగర్ హత్య నిందితుల అరెస్ట్




భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూన్ 23

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం అంబేద్కర్ నగర్ గ్రామపంచాయతీలో ఇనగంటి నాగరాజు హత్య కేసులో నిందితుల అరెస్టు. డి.ఎస్.పి ఆదినారాయణ తెలిపిన వివరాల ప్రకారం అంబేద్కర్ నగర్ కు చెందిన శివాజీ సన్నాఫ్ శ్రీను అను అతను తన భార్యను అదే గ్రామానికి చెందిన ఇనగంటి నాగరాజు వెంట పడి వేధిస్తున్నాడు అని భర్త కి చెప్పగా 21 జూన్ 2026 న రాత్రి 10 : 20 గంటల సమయంలో సాధన శివాజీ అతని భార్య నాగేశ్వరి అతని చెల్లెలు పరిశుద్ధ అలియాస్ ప్రమీల పథకం ప్రకారంగా నాగరాజుని చంపాలని నిర్ణయించుకొని సాధన శివాజీ భార్య చెల్లెలి ప్రోద్భలంతో అదే రోజు రాత్రి 10 20 గంటల సమయంలో నాగరాజు ఇంటికి వెళ్లి ఇంటిలో పడుకుని ఉన్న నాగరాజుని కత్తితో పొడిచి పారిపోగా మంగళవారం శివాజీ ఇంటికి వచ్చినాడని సమాచారం మేరకు ఇన్స్పెక్టర్ ఎం కరుణాకర్ తన సిబ్బందితో శివాజీ ఇంటికి వద్దకు వెళ్లి అరెస్టు చేసి విచారించి అరెస్టు చేసి అతని వద్దనుండి నాగరాజుని పొడిచి చంపిన కత్తినీ అతని ఒంటిపై ఉన్న టీ షర్టును స్వాధీన పరుచుకొని రిమాండ్ చేయటం జరిగిందని కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ మీడియా సమావేశంలో తెలియజేసినారు ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ కరుణాకర్,టూ టౌన్ ఎస్ఐ లు రాజ శేఖర్, జీవన్ రాజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

-ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



ముథోల్:23జూన్(తెలంగాణ పత్రిక)

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సరస్వతి మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జి.ఆర్.సి, సీఎం టిసి కేంద్రాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయన్నారు.పోటీ ప్రపంచంలో మగవారికి సమానంగా మహిళలు స్వయం గాజీవనోపాధి పొందతో అభివృద్ధి చెందుతున్నారన్నారు. జి ఆర్ సి, సీఎం టిసి కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆనందరావు పటేల్, సర్పంచ్ షబానా ఏజాజోద్దీన్, ఉప సర్పంచ్ కోరి లావణ్య సాయినాథ్, ఎంపీడీవో లవ కుమార్, మండల సమైక్యం అధ్యక్షురాలు జయ శిల,ఏపీఎం గురు చరణ్, మహిళా సంఘాల సభ్యులు ,నాయకులు పాల్గొన్నారు.

# పాస్‌పోర్ట్ పోగొట్టుకున్న యువకుడు




మంగపేట, జూన్ 23:(తెలంగాణ పత్రిక)

ములుగు జిల్లా, మంగపేట మండలం, వాగొడ్డు గూడెం పంచాయతీ పరిధిలోని నడింగూడెం గ్రామానికి చెందిన చౌలం రక్షక్ దేవ్ తన పాస్‌పోర్ట్‌ను పోగొట్టుకున్నారు. గత శనివారం తన నివాసంలో జరిగిన సోదరుని నిశ్చితార్థ వేడుకల సమయంలో ఈ పాస్‌పోర్ట్ అనుకోకుండా తప్పిపోయినట్లు బాధితుడు తెలిపారు. సంబంధిత పాస్‌పోర్ట్ నెంబర్ లిూ92354222లి అని ఆయన పేర్కొన్నారు. ఇంట్లో మరియు చుట్టుపక్కల ఎంత వెతికినా ఫలితం లేకపోయిందని, ఈ పాస్‌పోర్ట్ ఎవరికైనా లభిస్తే దయచేసి 7207757431 నెంబర్‌కు సమాచారం అందించాలని ఆయన కోరారు. పాస్‌పోర్ట్ దొరికిన వారు మానవతా దృక్పథంతో సహకరించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# అభివృద్ధి బాటలో మంగపేట

-నూతన బస్ స్టాండ్ వద్ద డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తేనే పనులకు పరిపూర్ణత!



మంగపేట, జూన్ 23 (తెలంగాణ పత్రిక):

మంగపేట మండల కేంద్రం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇందులో భాగంగా చేపట్టిన సెంట్రల్ లైటింగ్, సిసి రోడ్డు పనులు రూపురేఖలను మారుస్తుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే, జరుగుతున్న ఈ అభివృద్ధి పనులకు తోడుగా, చిన్నపాటి సాంకేతిక లోపాలను సరిదిద్దితేనే అభివృద్ధికి నిండుతనం వస్తుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రణాళికాబద్ధంగా ముందుకు మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న బస్ స్టాండ్ మంగపేటకు కొత్త శోభను తీసుకురానుంది. అయితే, రాత్రి కురిసిన వర్షానికి బస్ స్టాండ్ ఆవరణలో నీరు నిలవడం గమనించిన స్థానికులు, దీనిపై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు ఎత్తును పెంచడం వల్ల నీరు పక్కకు వెళ్లడానికి వీలులేకుండా ఉందని, దానికి అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను కూడా నిర్మిస్తే ఈ సమస్య శాశ్వతంగా తొలగిపోతుందని ప్రజలు సూచిస్తున్నారు. ప్రజాప్రతినిధులపై నమ్మకం మండల కేంద్రం ముంపు బారిన పడకుండా ఉండాలంటే, ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు పనుల అంచుల్లోనే తక్షణమే పక్కా డ్రైనేజీలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రజల సౌకర్యం కోసం ప్రభుత్వం చేపట్టిన ఈ పనులు, పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే మండల కేంద్రం అందమైన, ఆహ్లాదకరమైన ప్రాంతంగా మారుతుందనడంలో సందేహం లేదు. అధికారులు విభాగం సమన్వయంతో, ఈ చిన్నపాటి లోపాన్ని సరిదిద్ది పనులను నాణ్యంగా పూర్తి చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.

# ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలి

-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



నిర్మల్ జిల్లా ప్రతినిధి జూన్ 23 (తెలంగాణ పత్రిక)

జిల్లాలో అన్ని శాఖలలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ సకాలంలో జీతాలు అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు, వివిధ శాఖల్లో పని చేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు, తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శాఖల వారీగా జిల్లాలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, శాఖలు, ఏజెన్సీలు సమర్పించిన ఉద్యోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు అందగానే ఏజెన్సీలు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఖాతాల్లోకి జీతాలు జమ చేయాలన్నారు. వేతనాలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీఎఫ్ డబ్బులను సకాలంలో జమ చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి లభించిన పోస్టులను నియమ నిబంధనల ప్రకారం, పారదర్శకంగా భర్తీ చేయాలని చెప్పారు. ఉద్యోగుల వివరాల వెల్లడింపులో ఆలస్యం చేయకూడదన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ఔట్సోర్సింగ్ ఏజెన్సీల నిర్వాహకులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎంపీడీవోను సన్మానించిన దోమకొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు



కామారెడ్డి జిల్లా దోమకొండ జూన్ 23 (తెలంగాణ పత్రిక)

మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఎంపీడీవో గా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో ని పట్టణ కాంగ్రెస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించిన పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సీతారాం మధు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ ఫలాలు ఇందిరమ్మ ఇల్లు నూతన పెన్షన్లు అర్హులకు అదే విధంగా కృషి చేయాలని పలు అంశాలపై చర్చించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కదిరి గోపాల్ రెడ్డి మాజీ వార్డ్ మెంబర్ అబ్ర బోయిన రాజేందర్ శివరాం మందిర్ మాజీ అధ్యక్షులు అబ్ర బోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 28 న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.




నిర్మల్ జిల్లా ప్రతినిధి జూన్ 23 (తెలంగాణ పత్రిక)

ఈనెల 28వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్క్ ఫోర్స్ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 28వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, పోలియో చుక్కల ప్రాధాన్యతను వివరించాలని చెప్పారు. జూన్ 28వ తేదీ తర్వాత కూడా సిబ్బంది ఇంటింటికి వెళ్లి, చుక్కలు వేయించుకోని పిల్లలను గుర్తించి వారికి పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. అలాగే రానున్న నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ఆసుపత్రులకు రోగుల తాకిడి పెరిగే అవకాశం ఉన్నందున వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లంపేట లో పల్లె దవఖాన, వన మహోత్సవం,ఇందిరమ్మ గృహా లను సందర్శించినజిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి ,జూన్ 23,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డిజిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం మాచారెడ్డి మండలంలోని ఎల్లంపేట గ్రామాన్ని సందర్శించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు.

ముందుగా గ్రామంలోని పల్లె దవాఖానను తనిఖీ చేసిన కలెక్టర్, అవుట్ పేషంట్ (ఓపీ) రిజిస్టర్‌ను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అనంతరం ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎల్లంపేట రైతు వేదిక ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు. తదుపరి మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద గృహ నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న ఎల్లంపేట గ్రామానికి చెందిన శ్రీమతి బుద్ధి నవీన ను అభినందించి, ప్రభుత్వం తరపున గుర్తింపుగా గోడ గడియారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్‌లో రూ. 2,694...వసూలు మాత్రం రూ.18 వేలు

-గోడుకొండ్ల గ్రామపంచాయతీలో పన్ను వసూళ్లపై వివాదం

చింతపల్లి జూన్ 23 (తెలంగాణ పత్రిక ):-




నల్లగొండ జిల్లా,చింతపల్లి మండలం,గోడుకొండ్ల గ్రామపంచాయతీలో ఇంటి పన్ను వసూళ్ల వ్యవహారం వివాదాస్పదంగా మారింది.గ్రామానికి చెందిన ఓ ఇంటి యజమాని 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్ను వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించగా రూ. 2,694 మాత్రమే బకాయిగా నమోదై ఉన్నట్లు గుర్తించారు.అయితే అదే పన్ను చెల్లింపు పేరుతో గ్రామపంచాయతీ కార్యదర్శి రూ. 18 వేల రూపాయలను వసూలు చేసినట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి.బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం,పన్ను చెల్లింపునకు సంబంధించి కార్యదర్శి సూచించిన మేరకు రూ.18 వేల మొత్తాన్ని చెల్లించగా,అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి రసీదు కూడా అందించినట్లు తెలిపారు.అయితే ఆన్‌లైన్ రికార్డుల్లో చూపుతున్న మొత్తం,వసూలు చేసిన మొత్తం మధ్య భారీ వ్యత్యాసం ఉండటంతో ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.ఈ ఘటనపై గ్రామస్థులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.ఆన్‌లైన్‌లో నమోదైన పన్ను మొత్తానికి మించి ఎందుకు వసూలు చేశారనే అంశంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.అదనంగా వసూలు చేసిన మొత్తానికి సంబంధించిన పూర్తి వివరాలు,రికార్డులు ప్రజలకు వెల్లడించాలని కోరుతున్నారు.మరోవైపు,ఈ విషయంపై సంబంధిత అధికారులను వివరణ కోరగా పూర్తి సమాచారం సేకరించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు సమాచారం.గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ పన్ను వసూళ్ల వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా గురజాల శ్రీధర్ ఎన్నిక

-మహబూబ్‌నగర్‌లో ఘనంగా ముగిసిన రాష్ట్ర నాలుగో మహాసభలు

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 23, తెలంగాణ పత్రిక

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాలుగో రాష్ట్ర మహాసభలు ఈ నెల 20, 21, 22 తేదీలలో మహబూబ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి గురజాల శ్రీధర్‌ను తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నారు.ఈ మహాసభలకు జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యులు హాజరయ్యారు. వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ కార్మికుల సమస్యలు, వారి స్థితిగతులపై చర్చించి పలు తీర్మానాలు చేశారు.ఉపాధి హామీ పథకం సమర్థవంతంగా అమలు కావాలంటే కేంద్ర బడ్జెట్‌లో రూ.2.5 లక్షల కోట్లు కేటాయించాలని, పని దినాలను 200 రోజులకు పెంచాలని, కనీస కూలీ రూ.600 చెల్లించాలని మహాసభ డిమాండ్ చేసింది. అలాగే వ్యవసాయ కార్మికుల కూలీ రేట్లకు సంబంధించి పార్లమెంట్‌లో సమగ్ర కూలీ చట్టాన్ని ఆమోదించాలని కోరింది.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి




హామీ పథకాన్ని కొనసాగించాలని, దాని స్థానంలో తీసుకొచ్చిన వి.బి.జీ. రామ్‌జీ పథకాన్ని రద్దు చేయాలని, ఉపాధి హామీ పథకానికి పూర్తి నిధులను కేంద్ర ప్రభుత్వమే భరించాలని తీర్మానించారు.గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని వ్యవసాయ కార్మికులకు 250 గజాల స్థలం కొనుగోలు చేసి, ఇల్లు నిర్మించుకునేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.15 లక్షల సహాయం అందించాలని డిమాండ్ చేశారు.వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కూలీల హక్కుల సాధన కోసం రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని మహాసభలో నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ నాగయ్య, రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ వెంకట్రాములు,



అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి కామ్రేడ్ వెంకట్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ తప్పెట్ల స్కైలాబ్, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు, నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యుడు గురజాల శ్రీధర్, జిల్లా అధ్యక్షులు గన్నారం నరసయ్య, జిల్లా కమిటీ సభ్యులు కుడుకల గిరిబాబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో పరిశుభ్రత పాటించని హోటళ్లు, రెస్టారెంట్లపై కఠిన చర్యలు

-తనిఖీల్లో పలు లోపాలు గుర్తించిన ఆహార భద్రతా అధికారి

కామారెడ్డి , జూన్ 23,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

వర్షాకాలంలో వాహక జనిత అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు అధికంగా ఉన్న నేపథ్యంలో కామారెడ్డి పట్టణంలోని నూతన బస్ స్టాండ్ ఎదురుగా ఉన్న పలు హోటళ్లు, రెస్టారెంట్లను ఆహార భద్రతా అధికారి జి. విక్రమ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా కొన్ని ఆహార వ్యాపార సంస్థల్లో మూతలు లేకుండా ఆహార పదార్థాలను నిల్వ చేయడం, అపరిశుభ్రమైన వంటశాలలు నిర్వహించడం, ఆహార తయారీ సిబ్బందికి ఆరోగ్య ధృవపత్రాలు లేకపోవడం, గ్లౌజులు , హెడ్ క్యాప్‌లు ధరించకపోవడం వంటి లోపాలు గుర్తించారు. సంబంధిత యాజమాన్యాలకు వెంటనే లోపాలను



సరిదిద్దాలని సూచించారు. ర్షాకాలంలో దోమలు, ఈగలు వంటి వాహకాల ద్వారా వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నందున జిల్లాలోని అన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, ఇతర ఆహార వ్యాపార సంస్థలు పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆహార భద్రతా అధికారి హెచ్చరించారు.

ఈ సందర్భంగా ఆయన జారీ చేసిన ముఖ్య

సూచనలు:

హోటల్, రెస్టారెంట్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూడాలి. దోమలు, ఈగలు వంటివి ఆహార పదార్థాల వద్ద చేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఆహార పదార్థాలను తప్పనిసరిగా మూతలతో భద్రపరచాలి. సురక్షితమైన, శుద్ధి చేసిన తాగునీటిని మాత్రమే వినియోగించాలి. వంట , వడ్డన సిబ్బంది పరిశుభ్రమైన దుస్తులు, గ్లౌజులు, హెడ్ క్యాప్‌లు ధరించాలి. చెత్తను ప్రతిరోజూ మూత ఉన్న డస్ట్‌బిన్‌లలో సేకరించి సకాలంలో తొలగించాలి. నిర్దేశించిన ఆహార భద్రతా ప్రమాణాలను పాటించని సంస్థలపై ఆహార భద్రతా చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆహార భద్రతా అధికారి శ్రీ జి. విక్రమ్ హెచ్చరించారు.

# ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న 7 వరి రకాలను సాగు చేసి బోనస్ పొందాలి

-యూరియా కొరతపై ఆందోళన అవసరం లేదు

-జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి ,జూన్ 23,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లామాచారెడ్డి మండలంలోని ఎల్లంపేట రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్వంచ మండలం ఎలుపు గొండ లో యూరియా కేంద్రం పరిశీలన రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన విత్తన మేళాను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. రైతులు ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న బీపీటీ-5204, డబ్ల్యూజీఎల్-44, ఆర్ఎన్ఆర్-15048 (తెలంగాణ సోనా), కేఎన్ఎం-1638, కేఎన్ఎం-7715, హెచ్ఎంటీ, జై శ్రీరామ్ వరి రకాలను సాగు చేసి ప్రభుత్వ బోనస్‌ను పొందాలని సూచించారు. యూరియా పంపిణీపై మాట్లాడుతూ, రైతులు యూరియాను ప్రత్యేక యాప్ ద్వారా బుక్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎలాంటి కొరత లేదని



తెలిపారు. యాప్‌లో బుక్ చేసిన అనంతరం రెండు రోజుల వరకు ఎరువుల బస్తాలను పొందే అవకాశం ఉంటుందని, రైతులు ఆందోళన చెందకుండా అవసరమైన సమయంలో బుకింగ్ చేసుకోవాలని సూచించారు. రైతులు ఆదాయ వనరులను పెంచుకునేందుకు ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్నినో ప్రభావం నేపథ్యంలో వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు మట్టిలో తగిన తేమ (పదును) ఏర్పడిన తర్వాతే విత్తనాలు వేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.



తొందరపడి విత్తనాలు చల్లకుండా, పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలు మరియు స్వల్పకాలిక పంట రకాలను ఎంపిక చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మోహన్, అదనపు జిల్లా వ్యవసాయ అధికారి (ఏడీఏ) అపర్ణ పాల్గొన్నారు. తహసీల్దార్ సరళాభాయి, ఎంపీడీవో గోపిబాబు, మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి రవి, ఎల్లంపేట గ్రామ సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# జ్ఞాన వికాసానికి గ్రంథాలయం ఓ వేదిక

-కామారెడ్డి జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించిన డీసీసీ అధ్యక్షులు

కామారెడ్డి ,జూన్ 23,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి ఆహ్వానం మేరకు మంగళవారం కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు మ పాఠకుల కోసం ఏర్పాటు చేసిన వివిధ సౌకర్యాలను ఆయన పరిశీలించారు. చదువుకునే వారికి ప్రశాంతమైన వాతావరణంతో పాటు అవసరమైన అన్ని వసతులు కల్పించినందుకు గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి ని డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో గ్రంథాలయాల పాత్ర ఎంతో కీలకమని, ఇటువంటి సౌకర్యాల కల్పన సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి



,డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ని శాలువాతో ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఇరువురు ప్రజా సేవ, విద్యాభివృద్ధి యువత ప్రగతి కోసం కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఐరెని సందీప్ కుమార్, కామారెడ్డి మండల అధ్యక్షులు రాజా గౌడ్, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్, ఎస్టీ సెల్ అధ్యక్షులు రెడ్యా నాయక్, ఎస్సీ సెల్ అధ్యక్షులు బాలరాజు, సి డి సి చైర్మన్ ఇర్షత్, డీసీసీ కార్యవర్గ సభ్యులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



నిర్మల్ జిల్లా ప్రతినిధి జూన్ 23 (తెలంగాణ పత్రిక)




నిర్మల్ జిల్లా యస్.పి డా,, జానకీ షర్మిల గారి ఆదేశాల మేరకు సారంగాపూర్ మండలం బీరవెల్లి గ్రామంలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం జరిగింది.ఈ సందర్భంగా సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ..నేటి యువత మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని అన్నారు. యువత ఎటువంటి దురలవాట్లకు బానిస కాకుండా ఉండాలని చెప్పారు.దఅవగాహన కోసం గోడ పత్రులు అటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రవి, లింగరావు, సర్పంచ్ ఎల్లయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## రైతు వేదిక లో విత్తన మేళా విత్తనాలను అందజేత



ఓదెల జూన్ 23 తెలంగాణ పత్రిక

ఓదెల మండల కేంద్రం లో నీ రైతు వేదిక లో విత్తన మేళా' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి భాస్కర్ మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావం వలన రైతు సోదరులు ఆరుతడి పంటలు, తక్కువ కాల పరిమితి ఉన్న వరి రకాలను సాగు చేయాలి అని రైతులకు. సూచించారు అదేవిధంగా మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 23 .6 .26 నుండి 30.6.26 వరకు ప్రత్యేక విత్తనమేల నిర్వహించడం జరుగుతుందని రైతు వేదికలో ప్రత్యేక కౌంటర్ ద్వారా 7 ఏడు రకాల సన్న వడ్లు అందించడం జరుగుతుందని. అదేవిధంగా బిపిటి 5204. కేఎన్ఎమ్. 1638. జైశ్రీరామ్ . ఆర్ ఎన్ ఆర్ 15048. కేఎన్ఎం 7715. హెచ్ఎంటి సోనా. డబ్ల్యూ జి ఎల్ 44 వంటి సన్న సన్న రకాలు వేసే రైతులకు ప్రభుత్వం ప్రత్యేక బోనస్ అందిస్తుందని పేర్కొన్నారు ప్రతి రైతు ఈ విషయాన్ని గమనించి తగ్గట్టుగా వరి ధాన్యం సన్న రకాలు వేసుకోవాలని అదేవిధంగా సాంప్రదాయ ఎరువులు యూరియా తగ్గించి నానో యూరియా నానో డిఏపి వాడాలని రసాయనిక మందులు వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు అడుగు వేయాలని కోరారు కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భాస్కర్ ఏఈఓ లు రైతులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై దాడులు తగదు

-బాధ్యులపైకఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

మెదక్ జిల్లా చిన్న శంకరంపేట (తెలంగాణ పత్రిక) జూన్ 23



నార్సింగి మన తెలంగాణ పత్రిక విలేఖరి రాఘవేంద్ర పై దాడికి నిరసనగా ప్రజా సమస్యలను అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టులపై దాడులు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఇటువంటి సంఘటనలు పత్రిక స్వేచ్ఛకు భంగంకలిగించడంతో జర్నలిస్టులకు భయాందోళనలు కలిగించే ప్రమాదం ఉందని సీనియర్ జర్నలిస్టు వెంకన్న బాబు, టి యు డబ్ల్యూ జే జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు గౌడ్ తాహ సిల్దార్ కు ఇచ్చిన వినతిపత్రంలో తెలిపారు. అందువల్ల ఈ ఘటనపై విచారణ జరిపి బాధితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు రాచర్ల నరేందర్ కృష్ణ గౌడ్ ప్రభాకర్ చారి నవీన్ కుమార్ నరేష్ గౌడ్ ప్రవీణ్ కుమార్ సందీప్ చారి గిరికల యాదగిరి భూమయ్య దేవరాజ్ చారి లక్ష్మణ్ మురళి సుధాకరు తదితరులు పాల్గొన్నారు

# చట్టాన్ని చేతిలోకి తీసుకోవద్దు

-అంత్యక్రియలు అయ్యేంతవరకు పోలీస్ పికెటింగ్
-తూప్రాన్ డిఎస్పీ నరేందర్ గౌడ్.



మెదక్ జిల్లా చిన్న శంకరంపేట (తెలంగాణ పత్రిక) జూన్ 23

చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామంలో వరుసగా రెండు హత్యలు సంచలనం సృష్టించాయి. తూప్రాన్ డిఎస్పి నరేందర్ కథనం ప్రకారం....సోమవారం గ్రామానికి చెందిన యాట శ్రీధర్ అనే యువకుడిని అదే గ్రామానికి చెందిన రవణబోయిన ప్రభాకర్,మహేష్, గణేష్ ప్రశాంత్ అనే ముగ్గురు వ్యక్తులతో కలిసి ఆటోతో ఉద్దేశపూర్వకంగా ఢీ కొట్టి చంపారు.ఈ ఘటన చేగుంట మండలం అనంతసాగర్ గ్రామంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. దీంతో పోలీసులు శ్రీధర్ శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా తూప్రాన్ సమీపంలోని ఓ హోటల్లో మృతుని తండ్రి, మరియు బంధువులకు హంతకుని తండ్రి రావణబోయిన యాదగిరి కనిపించాడు. దీంతో ఆవేశానికి గురైన మృతుడి తండ్రి,బంధువులు యాదగిరి పై దాడి చేసి శవాన్ని కొప్పులపల్లి డ్యాం లో అర్ధరాత్రి పడేశారు.దీంతో ఇరు కుటుంబాలలో విషాదం నెలకొంది. క్షణికావేశానికి గురై తొందరపాటులో చట్టాన్ని చేతిలోకి తీసుకోరాదని డీఎస్పీ హెచ్చరించారు.రెండు హత్యల్లో పాల్గొన్న వారిని అరెస్టు చేసి జైలుకు పంపుతామన్నారు. అంత్యక్రియలు పూర్తయ్య వరకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు గ్రామంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# యూరియా పేరుతో రైతులను రెచ్చగొడితే ఊరుకునేది లేదు

-ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు




కామారెడ్డి, జూన్ 23,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

యూరియా పేరుతో రైతులను రెచ్చగొడితే ఊరుకునేది లేదని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు హెచ్చరించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు, డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ రావుతో కలిసి మదన్ మోహన్రావు మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూసోషల్ మీడియా వేదికగా కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు యూరియా యాప్ పేరుతో రైతుల మీద పడ్డారని మండిపడ్డారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని అన్ని సొసైటీలకు యూరియా సరఫరా అయిందని, బీఆర్ఎస్ నాయకులకు చదువు రాదని, చెప్తే అర్థం చేసుకోరని విమర్శించారు. పీఏసీఎస్ చైర్మన్లుగా కొనసాగుతూ బీఆర్ఎస్‌కు సపోర్ట్ చేస్తూ డీడీలు కట్టకుండా యూరియా రాకుండా చేసి రైతులను ఇబ్బందులు పెడుతున్నారని, ప్రభుత్వాన్ని బదనాం చేస్తామని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వాళ్ల డేటా అంతా తమ దగ్గర ఉందని, ఒక్కొక్కరిని లోపల వేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. సోషల్ ఎలిమెంట్ యాక్ట్ కింద చర్యలు తప్పవని, యాప్‌లో టెక్నాలజీ ద్వారా రైతులకు యూరియా అందించాలన్నదే ప్రభుత్వ ఆలోచన అని స్పష్టం చేశారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తానూర్:23జూన్(తెలంగాణ పత్రిక)

మండలంలోని ఎల్వి విద్యుత్ సబ్ స్టేషన్ లో మరమ్మత్తులు పనుల్లో భాగంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ అజీముద్దీన్ మంగళవారం ఒక ప్రకటన తెలిపారు.ఎల్వి సబ్ స్టేషన్ పరిధిలోని హిప్నల్లీ, హిప్నల్లీ తాండా,హంగిర్గా,ఎల్వి, గ్రామాలలో విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని, దానికీ వినియోగదారులు, రైతులు, సహకరించాలని కోరారు.

# మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాలయాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి

-విద్యార్థుల హాజరు 100 శాతం ఉండేలా చూడాలి: జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
-ప్రత్యేక అధికారులు షెడ్యూల్ ప్రకారం హాస్టళ్లను తనిఖీ చేయాలి

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 23, తెలంగాణ పత్రిక

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఐడీఓసీలో మంగళవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి ప్రభుత్వ పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ గురుకులాలు, మోడల్ స్కూళ్లు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యాలయాల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా విద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య, హాజరు



శాతం, భోజన వసతులు, పరిశుభ్రత తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... ప్రతి పాఠశాల, రెసిడెన్షియల్ విద్యాలయంలో ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆహార పదార్థాలను నిబంధనల ప్రకారం భద్రపరచాలని, నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశించారు.అన్ని పాఠశాలలు, హాస్టళ్లు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరయ్యేలా చర్యలు తీసుకుని 100 శాతం హాజరు సాధించాలని ఆదేశించారు. ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన కొనసాగించాలని సూచించారు. గతంలో నియమించిన ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాలయాలను షెడ్యూల్ ప్రకారం సందర్శించి తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, డీటీడబ్ల్యూఓ సంగీత, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి అయేషా తలత్, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష, ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాళ్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# త్రివేణి స్కూల్స్ 33వ ఆవిర్భావ దినోత్సవం






భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూన్ 23

ఘనంగా నిర్వహణ త్రివేణి స్కూల్స్ 33వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం గంగా క్యాంపస్లో అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ముప్పై మూడు సంవత్సరాల విజయవంతమైన విద్యా ప్రస్థానాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ వేడుకలు ఆనందోత్సాహాల నడుమ సాగాయి. అనంతరం "33 వసంతాల సంచిక"ను సభలోని అతిథులకు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గొల్లపూడి ప్రకాశరావు (రిటైర్డ్ డిగ్రీ లెక్చరర్, జేకేసి కాలేజ్,గుంటూరు) వచ్చారు. వారు మాట్లాడుతూ, త్రివేణి సంస్థల ప్రస్థానాన్ని కవితా రూపంలో అద్భుతంగా ఆవిష్కరించారు. త్రివేణి సంస్థలు మానవత్వం, క్రమశిక్షణ, విలువలు, అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తున్నాయని, అలాంటి గొప్ప లక్షణాలను ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. త్రివేణి సంస్థల డైరెక్టర్ గొల్లపూడి జగదీష్ మాట్లాడుతూ, విద్యార్థులు సాటి విద్యార్థులతో ప్రేమాభిమానాలు, స్నేహభావంతో మెలగాలని, ఉపాధ్యాయుల పట్ల గౌరవం, తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞత, సమాజం పట్ల బాధ్యతతో కూడిన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు మాచివరపు కోటేశ్వరరావు మాట్లాడుతూ, బాల్యం, యవ్వనం, ప్రౌఢ దశలో వ్యక్తి జీవితంలో చోటుచేసుకునే మార్పులు, బాధ్యతలు, అవకాశాలు, సవాళ్ల గురించి వివరించారు. ప్రతి దశలో మంచి విలువలు, క్రమశిక్షణ, లక్ష్యసాధనతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, గీతాలు, ప్రసంగాలు, కవితా పఠనం సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, అతిథులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో "పాల్గొన్నవారిని డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి, సీఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపల్స్ శ్రీనివాస సింగ్, నేతాజీ, సూర్యనారాయణమూర్తి, వైస్ ప్రిన్సిపల్ సౌజన్య పాల్గొని త్రివేణి కుటుంబ సభ్యులకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు విద్యారంగంలో నాణ్యమైన విద్యను అందిస్తూ ముందుకు సాగుతున్న త్రివేణి స్కూల్స్ మరెన్నో విజయాలను అందుకోవాలని అందరూ అభిలషించారు.

# కామారెడ్డిలో ఘనంగాశ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

కామారెడ్డి ,జూన్ 23,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి (బలిదాన్ దివస్) సందర్భంగా బీజేపీ కామారెడ్డి జిల్లా కార్యాలయంలో పలువురు బిజెపి నాయకులుఆయన చిత్ర పటానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత నెహ్రూ మంత్రి వర్గంలో మంత్రిగా ఉన్న శ్యామా ప్రసాద్ ముఖర్జీ నెహ్రూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, హిందూ వ్యతిరేక



విధానాలు నచ్చక మంత్రి పదవికి రాజీనామా చేసి భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షులుగా రాజకీయ పార్టీ ఏర్పాటు చేసి దేశంలో నూతన శకానికి నాంది పలికిన నాటి నుండి నేటి భారతీయ జనతా పార్టీ వరకు ఆయన చూపిన మార్గంలోనే పార్టీ నడుస్తుందనీ అన్నారు. జమ్మూ కాశ్మీర్ ప్రాంతానికి ప్రత్యేక హక్కులు కల్పించే 370 ఆర్టికల్ రద్దు చేయాలని ఆయన చేసిన ఉద్యమాల్లో భాగంగా బలిదానం అయ్యారు. ఆయన ఆకాక్షించిన ఆర్టికల్ 370 ని నరేంద్ర మోదీ రద్దు చేసి ఆయన కాశ్మీర్ ను సంపూర్ణంగా విలీనం చేయటం జరిగిందనీ ఆయన కలను సహకారం చేయటం జరిగిందనీ అన్నారు.

# యూరియా యాప్ ను రద్దు చేయాలని బిఆర్ఎస్ ధర్నా

-సాధారణ వ్యక్తుల పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్
-అరెస్టు చేసిన పోలీసులు

కామారెడ్డి, జూన్ 23,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

యూరియా యాప్ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తాడ్వాయి మండల కేంద్రంలో చేపట్టిన ధర్నా ఉద్రిక్తతలకు దారి తీసింది. ఉదయం నుంచి ధర్నా విషయంలో అనిశ్చితి నెలకొనగా మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఎంట్రీతో ఒక్కసారిగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. సాధారణ వ్యక్తి మాదిరిగా ఓ బైక్పై వచ్చిన సురేందర్ జై బీఆర్ఎస్, జై తెలంగాణ



అంటూ ధర్నాకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దాంతో పోలీసులకు, మాజీ ఎమ్మెల్యేకు మధ్య కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం మాజీ ఎమ్మెల్యేను బలవంతంగా అరెస్ట్ చేసి పోలీసు వాహనంలో ఎక్కించుకుని అక్కడినుంచి ఇతర పోలీస్ స్టేషన్ కు తరలించారు. కాసేపటికి బీఆర్ఎస్ నేతలు తాడ్వాయి చౌరస్తాకు రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. వచ్చిన వాళ్ళను వచ్చినట్టు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. అయితే తాడ్వాయి సొసైటీ చైర్మన్ కపిల్ రెడ్డి పోలీసుల కళ్లుగప్పి పెట్రోల్ బాటిల్తో రోడ్డుపైకి వచ్చి హల్చల్ చేశారు. దాంతో పోలీసులు అప్రమత్తమై కపిల్ రెడ్డి వద్ద నుంచి పెట్రోల్ బాటిల్ లాక్కుని అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించగా సీఐకి, కపిల్ రెడ్డికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

# మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును కలిసిన కామారం తాండవాసులు

మెదక్ జిల్లా చిన్న శంకరంపేట (తెలంగాణ పత్రిక) జూన్ 23

చిన్న శంకరంపేట మండలం కామారం తండా హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి లికాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును జన్నేపల్లి ఫామ్ హౌస్ లో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కామారం తండా సర్పంచ్ హాలావత్ మోహన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్బర్, రవిచంద్ నాయక్, రుక్య, తుకారాం, భీమ్లా, నరేష్, ఈరు, స్వామి, తర్య నాయక్, మరియు తాండ నాయకులు పాల్గొన్నారు



# 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి నివేదిక కార్యక్రమ విజయాలను కేస్ స్టడీలుగా నమోదు చేయాలి






-జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి
-ప్రతి శాఖ విజయాలు, ఉత్తమ పద్ధతులు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వివరాలతో సమగ్ర నివేదికలు రూపొందించాలి..
-రోడ్డు ప్రమాదాల తగ్గుదలపై గత ఏడాదితో పోల్చి విశ్లేషణ చేయాలి..
-గురుకులాల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండకుండా చర్యలు తీసుకోవాలి..
-ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక కొరత తలెత్తకుండా చర్యలు చేపట్టాలి..
-ప్రతి శాఖ విజయగాథలు, ఉత్తమ ఫొటోలతో ఐదు రోజుల్లో ప్రత్యేక బుక్‌లెట్ సిద్ధం చేయాలి...
-99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా ప్రత్యేక అధికారి

తెలంగాణ పత్రిక జూన్ 23 ఖమ్మం

99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో సాధించిన విజయాలను కేస్ స్టడీల రూపంలో నమోదు చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి, గనుల శాఖ ప్రత్యేక కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత జిల్లా అధికారులతో 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక అమలుపై సమీక్షించారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు తమ శాఖల ద్వారా చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి, జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల కార్యక్రమం విజయగాథలను గుర్తించి నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రతి శాఖ తమ విజయాలు, సాధించిన ఫలితాలు, ఉత్తమ పద్ధతులు, ప్రజలకు కలిగిన ప్రయోజనాలను సంక్షిప్తంగా పొందుపరుస్తూ నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి శాఖ నివేదికలో స్పష్టమైన వివరాలు ఉండాలని, ఇతర జిల్లాల్లో అమలు చేయదగిన ఉత్తమ పద్ధతులను ప్రత్యేకంగా పేర్కోవాలని తెలిపారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులు, వాటి ప్రస్తుత స్థితి, పరిష్కార వివరాలను కూడా నివేదికల్లో పొందుపరచాలని సూచించారు. పాలేరు నియోజక వర్గంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో అందిన దరఖాస్తులు, పరిష్కరించిన సమస్యలు, పెండింగ్ దరఖాస్తుల వివరాలతో ప్రత్యేక నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు, బ్లాక్ స్పాట్‌ల సవరణ చర్యల వల్లమరణాల సంఖ్యలో వచ్చిన తగ్గుదలను గత ఏడాది గణాంకాలతో పోల్చి చూపించాలని, ప్రమాదాల తగ్గుదల స్పష్టంగా ప్రతిబింబించేలా నివేదికలు రూపొందించాలని సూచించారు. జిల్లాలోని గురుకుల రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండకూడదని, నిరుపేదలు, అనాథలు,ఒంటరి తల్లిదండ్రుల పిల్లలకు ప్రాధాన్యతనిస్తూ ఖాళీ సీట్లను భర్తీ చేయాలని సూచించారు. మంచి విద్య పిల్లలకు జీవితాంతం ఉపయోగపడే గొప్ప బహుమతి అని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు టీజీఎంఐడీసీ, మన ఇసుక వాహనం ద్వారా ఉచిత ఇసుక సరఫరా చేస్తున్నామని, ఖమ్మంజిల్లాలో ఇసుక సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. ప్రతి నియోజక వర్గంలో నాణ్యమైన ఇసుక బజార్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక కేటాయింపులు కూడా టీజీఎంఐడీసీ ద్వారా జరుగుతున్నాయని చెప్పారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశానికి అన్ని శాఖలు తమ అవసరమైన ఇసుక ప్రతిపాదనలు పంపాలని సూచించారు. 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికపై రూపొందించే బుక్‌లెట్‌లో ప్రతి శాఖ విజయ గాథలు, ఉత్తమ కేస్ స్టడీలు, థీమ్ వారీగా ఎంపిక చేసిన ఉత్తమ ఫొటోలను పొందుపరచాలని సూచించారు. బుక్‌లెట్ పరిమాణం కంటే నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఐదు రోజుల్లో బుక్‌లెట్ పూర్తి చేయాలని ఆదేశించారు. 99 రోజుల కార్యక్రమంలో ప్రారంభమైన పనులకు సంబంధించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను కూడా బుక్‌లెట్‌లో చేర్చాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యాచరణకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో అధికారులు ఇప్పటివరకు అద్భుతంగా పనిచేశారని అభినందించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఖమ్మం జిల్లాలో 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికను విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. మార్చి 6 నుండి మార్చి 15 వరకు నిర్వహించిన పరిశుభ్రత, ఫైల్ క్లియరెన్స్ కార్యక్రమంలో 11,326 ఫైళ్లను పరిష్కరించామని తెలిపారు. జిల్లాలోని 571 గ్రామాలు, 177 పట్టణ వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. మాతృ మరణాల రేటును సున్నాకు తీసుకురావాలనే లక్ష్యంతో తల్లి ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. "ప్రతి ప్రసవం సురక్షితం" కార్యక్రమం ద్వారా హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణ తో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మొబైల్ ఎక్స్‌రే వాహనాల ద్వారా ప్రత్యేక శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల నిర్మూలన కార్యక్రమాలు, రోడ్డు భద్రత చర్యలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. బాలల భద్రత వారోత్సవాలు నిర్వహించి అన్ని విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. 53 మంది అనాథ పిల్లలకు ఆధార్ కార్డులు, జనన ధృవీకరణ పత్రాలు, కుల ధృవీకరణ పత్రాలు, ఆరోగ్యశ్రీ కార్డులు అందించినట్లు తెలిపారు. జిల్లాలో నిర్వహించిన జాబ్‌మేళా ద్వారా 610 మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. వ్యవసాయ వారోత్సవాలు నిర్వహించి రైతు భరోసా, నానో యూరియా వినియోగం, రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, పంట అవశేషాల దహనం నివారణ, వ్యవసాయ యాంత్రీకరణ, ఆయిల్ పామ్ సాగు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నేల ఆరోగ్య నిర్వహణపై విస్తృత అవగాహన కల్పించినట్లు తెలిపారు. అలాగే విద్యా వారోత్సవాలు, యువజన, క్రీడా వారోత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. మహిళల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మునిసిపల్ కమీషనర్ లు, తదితరులు పాల్గొన్నారు.

# బోయినపల్లి మండల అభివృద్ధిపై కలెక్టర్ తో ఎమ్మెల్యే సమీక్ష

-ముంపు గ్రామాల వాసుల సమస్యలు పరిష్కరించాలి
-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భేటీ

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 23, తెలంగాణ పత్రిక



చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని బోయినపల్లి మండల అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భేటీ అయ్యారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ తో ఎమ్మెల్యే సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మండలంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, రోడ్లు ఇతర నిర్మాణ పనులపై చర్చించారు. అభివృద్ధి పనుల పురోగతిపై ఎమ్మెల్యే వివరాలు అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులు పరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. మధ్య మానేరు ముంపు గ్రామాల వాసుల సమస్యలపై చర్చించి త్వరితగతిన వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యూరియా యాప్, సన్న వడ్ల సాగు, ఆయిల్ ఫామ్ సాగు పంటల మార్పిడి తదితర అంశాలపై చర్చించారు.

# పిల్లల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యత మీపై ఉంది సర్పంచ్



ఓదెల జూన్ 23 తెలంగాణ పత్రిక

పిల్లల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్ది ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత మీపై ఉందని సర్పంచ్ కనకిరెడ్డి సతీష్ అన్నారు ఈ సందర్భంగా ఓదెల గ్రామంలో మల్లికార్జున్ నగర్ లో ఫ్రీ ప్రైమరీ పాఠశాల కు ఎన్నికైనటువంటి బోధకురాలు మద్ది స్రవంతి మరియు ఆయా బీరం సునీత ఇరువురు మంగళవారం విధుల్లో చేరిన సందర్భంగా ఇద్దరినీ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన సర్పంచి మరియు పాలకవర్గం ఎంఈఓ వై రమేష్ క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు పద్మ ఈ సందర్భంగా సర్పంచ్ కనకిరెడ్డి సతీష్ మాట్లాడుతూ ముందుగా బోధకురాలు మరియు ఆయా కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ మీ సేవలు విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేయాలని ప్రైవేటు పాఠశాలలకు పోటీగా మన ప్రభుత్వం విద్యాసంస్థలు ఉండాలని పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పే విధంగా ఉపాధ్యాయులు పనిచేయాలని అన్నారు అదేవిధంగా మొట్టమొదటిసారిగా ఫ్రీ ప్రైమరీ స్కూల్ మంజూరు చేసిన ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు అన్నారు ఈ సందర్భంగా ఎం ఈ ఓ రమేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులందరూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో పంపితే వారు భవిష్యత్తుకు మేము భరోసా ఇస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనికి రెడ్డి సతీష్ ఎంఈఓ రమేష్ క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయులు వి పద్మ ప్రిన్సిపల్ రమేష్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీకేజ్ బాధిత విద్యార్థులకు సంఘీభావం

-రాహుల్ గాంధీ 'చాత్రోన్ కీ గూంజ్ - కోట' కార్యక్రమానికి మద్దతుగా నేడుకామారెడ్డిలో కొవ్వొత్తుల ర్యాలీ

కామారెడ్డి , జూన్ 23,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిన నీట్ పేపర్ లీకేజ్ ఘటనల నేపథ్యంలో, ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు నివాళు లర్పిస్తూ, వారి కుటుంబాలకు సంఘీభావం ప్రకటిస్తూ, అలాగే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జీచేపట్టిన చాత్రోన్ కీ గూంజ్ - కోట కార్యక్రమానికి మద్దతుగా రేపు సాయంత్రం 4 గంటలకు కామారెడ్డి జిల్లా కేంద్రంలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని కామారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో డిసిసి కార్యవర్గ సభ్యులు, కామారెడ్డి జిల్లాలోని మండల కాంగ్రెస్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు మరియు విద్యార్థి యువత పెద్ద ఎత్తున పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం అన్యాయానికి వ్యతిరేకంగాకొవ్వొత్తుల వెలుగుతో మన గొంతుకను వినిపిద్దాంఅని పిలుపునిచ్చారు.

# శ్రీ సర్వదేవ పరంజ్యోతి భగవతి ఆలయంలో

-350 మందికి అన్నప్రసాద వితరణ

కామారెడ్డి, జూన్ 23,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శ్రీ సర్వదేవ పరంజ్యోతి భగవతి ఆలయంలో మంగళవారం సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.నేటి అన్న ప్రసాద దాతలుగా పసుపునూరి వెంకటరమణ కవిత దంపతుల కుమార్తె గట్టు శ్రావణ సంధ్య అజయ్ కుమార్ ల పెళ్లి రోజు సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ సేవకులు డాక్టర్ బాలు మాట్లాడుతూ గట్టు శ్రావణ సంధ్య అజయ్ కుమార్ ల పెళ్లి రోజు సందర్భంగా పసుపు నూరి వెంకటరమణ కవిత దంపతులు ఆర్థిక సహకారాన్ని అందజేయడం జరిగింది వారి కుటుంబానికి ఐశ్వర్యాన్ని ఆరోగ్యాన్ని సకల సంపదలను అమ్మ భగవానులు అనుగ్రహించాలని ఆలయంలో పూజలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో 350 మందికి అన్న ప్రసాదాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్శి శ్రీనివాస్, దొంతి సుధాకర్,పప్పుల ఆంజనేయులు,రాజమణి,పప్పుల శ్రావణి,పాత స్వరూప,నీల అద్విక్ సాయి,నీల సాయి అద్విత లు పాల్గొన్నారు.

# చిన్న వాన చినుకుతో చెరువుల తలపిస్తున్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి

-బీజేవైఎం రాష్ట్ర నాయకులు నందనం విష్ణు దత్ నిరసన.





తెలంగాణ పత్రిక న్యూస్ ప్రతినిధి శేర్లింగంపల్లి నియోజకవర్గం జూన్ 23.

మదీనగూడ డివిజన్ హుడాకాలనీ మరియు పాపిరెడ్డి కాలనీ మధ్యలో ప్రజల సౌకర్యర్థం కోసం ఏర్పాటు చేసిన రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వర్షాకాలంలో వర్షపు నీటితో నిండిపోయింది పట్టించుకొని జిహెచ్ఎంసి అధికారులు. ప్రతిసారి వర్షం వచ్చినప్పుడుల్లా ఇదే పరిస్థితి అని, పూర్తి స్థాయిలో నివారణ చర్యలు చేపట్టలేకపోతున్నారు అని ఇప్పటికైనా మొద్దునిద్ర వదిలి తక్షణమే జిహెచ్ఎంసి అధికారులు నీటిని తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండ చూడాలి అని బీజేవైఎం రాష్ట్ర నాయకులు నందనం విష్ణు దత్ ఆధ్వర్యంలో వర్షంతో నిండిన నీటిలో పేపర్ పడవలను స్థానిక చిన్నారులతో కలసి వదిలి నిరసన తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి వజీర్ రాజు ముదిరాజ్, సీనియర్ నాయకులు దేవేందర్ రావు, వెంకటేష్ ముదిరాజ్, అమర్నాథ్ రెడ్డి, పాలం శ్రీనివాస్ యాదవ్, శ్రీకాంత్ మరియు కాలనీ నాయకులు పాల్గొన్నారు.

## నూతన తహసిల్దార్ ఎంపీడీవో ను సన్మానించిన సర్పంచ్

ఓదెల జూన్ 23 తెలంగాణ పత్రిక





ఓదెల మండల నూతన తహసిల్దారు వనజా నాయక్ మరియు, నూతన ఎంపీడీవో అనిల్ రెడ్డి లని హరిపురం గ్రామ సర్పంచ్ గ్యారవేని విజయ నాగరాజు యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. పూల బొకే అందించారు ఈ సందర్భంగా నూతన అధికారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మండల అభివృద్ధికి మీ సేవలు ఎంతో ఉపయోగపడాలని ఆకాంక్షించారు. అధికారులు కూడా ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో సమర్థవంతమైన పాలన అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసరి మహేందర్ యాదవ్, ముప్పు రాకేష్, అట్టేపల్లి రాజు, బేరం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## కనగర్తి గ్రామంలో ఘనంగా గంగాదేవి బోనాలు

ఓదెల జూన్ 23 తెలంగాణ పత్రిక



ఓదెల మండలంలోని కనగర్తి గ్రామంలో మంగళవారం ఘనంగా గంగాదేవి బోనాల పండగ రంగ రంగ వైభవంగా నిర్వహించారు ప్రతి ఇంటికి ఒక బోనం బయలుదేరి శివసత్తుల పూనకాలతో డప్పు సప్పులతో అమ్మవారి బోనాలు సమర్పించారు ప్రతి సంవత్సరం ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ పండుగకు ఒక ప్రత్యేకత సంతరించుకుంది గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా ఆ గంగాదేవి గుడికి వెళ్లి మొక్కితే తమ కోరికలు తీరుతాయని ఆపత తొలిగిపోతుందని నమ్మకం ఈ గ్రామంలో ప్రత్యేకంగా సంతరించుకుంది ప్రతి ఇంటికి ఒక బోనంతో అమ్మవారికి బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అమ్మవారి దయతో వర్షాలు పుష్కలంగా పడి రైతులంతా సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కుకోవడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ చొప్పరి సంధ్య కుమార్ తో పాటు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జిల్లా అధ్యక్షుడు కందుల సదాశివ్ ఉపసర్పంచి మరియు నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇండ్లతో వెలుగుమట్ల పేదల సొంతింటి కల సాకారం





-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్..
-ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి..
-వెలుగుమట్ల లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం.. వేగంగా సాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు..
-నిర్దిష్ట గడువులోగా పనులు జరిగేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలి..
-వెలుగుమట్లలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్..

తెలంగాణ పత్రిక జూన్ 23 ఖమ్మం

ప్రభుత్వం పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం ఖమ్మం నగర పరిధిలోని వెలుగుమట్ల ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను మున్సిపల్ కార్పోరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో తిరుగుతూ నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను ఒక్కొక్కటిగా పునాదుల నిర్మాణం, గోడల నిర్మాణం, పైకప్పు పనులు, తుదిదశ పనుల పురోగతిని పరిశీలించారు. ప్రతి ఇంటి నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తూ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా సహకరించాలని హౌసింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఇంటి నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, నిర్మాణ దశల వివరాలను తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీసి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఇండ్ల నిర్మాణాలు ప్రభుత్వం ప్రత్యేక చొరవతో వేగంగా కొనసాగు ఉన్నాయని తెలిపారు. వెలుగుమట్ల కాలనీకి ప్రధాన రహదారి, వాటర్ సౌకర్యం, విద్యుత్ స్తంభాలు పూర్తిస్థాయిలో లైట్లు ఏర్పాటు చేశామన్నారు. ఆదేవిధంగా ఇండ్లకు విద్యుత్ కనెక్షన్ తో పాటు మీటర్లు అమరుస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు స్థిరమైన గృహ వసతి కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని అన్నారు. ఇంటి నిర్మాణం వివిధ దశలను పూర్తిచేసిన వెంటనే ప్రభుత్వ ఆర్థిక సహాయం విడతల వారీగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోందన్నారు. పునాదుల నిర్మాణం పూర్తయిన తర్వాత, గోడల నిర్మాణం పూర్తయిన తర్వాత, స్లాబ్ దశ పూర్తయిన తర్వాత, తుదిదశ పనులు పూర్తయిన తర్వాత మొత్తం రూ.5 లక్షల వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైనప్పటికీ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా పునాది దశ పనులు ప్రారంభించలేని కుటుంబాలకు మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ అన్నారు. స్వయం సహాయక సంఘాల సహకారంతో లబ్ధిదారులు నిర్మాణ పనులు నిలిచిపోకుండా కొనసాగించే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల విషయంలో రెవెన్యూ, హౌసింగ్, విద్యుత్, మున్సిపల్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులు, సాంకేతిక సహాయం, పరిపాలనా అనుమతులు సకాలంలో అందించడంతో పాటు లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీ లో కలెక్టర్ వెంట హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, విద్యుత్ ఎస్ఇ శ్రీనివాసచారి, ఈఈ జగ్గారావు, హౌసింగ్ ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులు విత్తన మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

-జగన్నాథపురం రైతు వేదికలో విత్తన మేళా ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అంకిత్..

తెలంగాణ పత్రిక జూన్ 23 ఖమ్మం



రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం జూన్ 23 నుంచి 30వ తేదీ వరకు ప్రతి మండలంలో నిర్వహిస్తున్న విత్తన మేళాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. మంగళవారం పాల్వంచ మండలం జగన్నాథపురం రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం మేళాలో ఏర్పాటు చేసిన విత్తనాలు, వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించి, విత్తనాల ప్యాకెట్లపై ఉన్న క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసి వాటి ప్రామాణికతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన అన్ని రకాల ధ్రువీకరించిన, నాణ్యమైన విత్తనాలను ఒకే వేదికపై సరసమైన ధరలకు అందించేందుకు వ్యవసాయ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు. రైతు వేదికలలో నిర్వహిస్తున్న ఈ విత్తన మేళాల్లో సన్న రకాల వరి విత్తనాలు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డీఏపీ వంటి ఆధునిక వ్యవసాయ ఉత్పత్తులు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లాలోని 43 రైతు వేదికల ద్వారా విత్తన మేళాలు నిర్వహిస్తున్నామని, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా చర్యలు చేపట్టామని తెలిపారు. యూరియా బుకింగ్‌ను కూడా యాప్ ద్వారా నిర్వహిస్తున్నామని, రైతులు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. యూరియా బుకింగ్ యాప్, విత్తనమేలపై రైతులలో అవగాహన కలిగించాలని వ్యవసాయ శాఖ అధికారులని ఆదేశించారు. నకిలీ విత్తనాల విక్రయం, విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, వ్యవసాయ అవసరాలన్నీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని కలెక్టర్ తెలిపారు. రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విత్తన మేళా ద్వారా విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు, యూరియా బుకింగ్ ద్వారా యూరియా బుక్ చేసుకున్న రైతులకు కలెక్టర్ చేతులమీదుగా విత్తనాలు, యూరియా అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, సోసిటీ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాస్, తాసిల్దార్ ధారా ప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అందరికీ ఆదర్శంగా నిలిచిన ప్రభుత్వ ఉద్యోగ దంపతులు

-తమ కుమార్తెను ప్రభుత్వ ప్రీ-ప్రైమరీ స్కూల్‌లో చేర్పించిన వైనం
-ప్రభుత్వ పాఠశాలపై నమ్మకానికి ఇదే నిదర్శనం
-హర్షం వ్యక్తం చేస్తున్న పలువురు విద్యావేత్తలు,బస్తీ వాసులు

తెలంగాణ పత్రిక జూన్ 23 ఇల్లందు:




ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు మాటల్లో కాదు చేతల్లో చేసి చూపిస్తూ అందరికీ ఆదర్శప్రాయమైన నిర్ణయం తీసుకున్నారు ఇల్లందు పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగ దంపతులు.వివరాల్లోకి వెళితే...సూర్యాపేట జిల్లా మునగాల మండలం రేపాల గ్రామానికి చెందిన గంట ప్రదీప్,జ్యోతి ప్రభుత్వ ఉద్యోగ దంపతులు.ఉద్యోగ రీత్యా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలోని స్టేషన్ బస్తీలో నివాసముంటున్నారు.గంట ప్రదీప్ సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం వెలిశాల ప్రభుత్వ పాఠశాల ఎస్‌జీటీ గా విధులు నిర్వహిస్తుండగా,భార్య వల్లపుదాసు జ్యోతి ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నర్సింగ్ ఆఫీసర్ గా పని చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే ఆదర్శ భావాలు కలిగిన దంపతులు తమ చిన్నారిని తెలంగాణ ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ప్రభుత్వ ప్రీ-ప్రైమరీ పాఠశాలలో చేర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని,ప్రభుత్వ విద్యపై ప్రజల్లో నమ్మకం పెంచేందుకు తావే ముందుగా తమ కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు."ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య,మెరుగైన మౌలిక వసతులు,అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులు ఉన్నారని, తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ విద్యాసంస్థలపై విశ్వాసం ఉంచి తమ పిల్లలను చేర్పించాలి" అని వారు పిలుపునిచ్చారు.ప్రభుత్వ ఉద్యోగ దంపతుల ఈ నిర్ణయం ఇతర తల్లిదండ్రులకు స్ఫూర్తిగా నిలుస్తుందని,ప్రభుత్వ విద్యా వ్యవస్థపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తుందని స్థానికులు అభినందిస్తున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, అంగన్‌వాడీ టీచర్ ఉమాదేవి,ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ సౌందర్య,ఆయాలు సుజాత,ప్రియ, బస్తీ వాసులు భాగ్య,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143